


వార్త
ఆదివారం
29 సెప్టెంబరు, 2024
చెరువంత
హైడ్రా

## రాజమౌళి సినిమాలో

# కరీనా కపూర్?



బాలీవుడ్ నటి కరీనాకపూర్ సౌత్ ఎంట్రీ ఖాయమైంది. కరీనా కపూర్ యష్ 'టాక్సిక్' సినిమాతోనే దక్షిణాదికి రావాల్సి వున్నప్పటికీ ఆ ప్రాజెక్ట్ నుంచి కరీనా తప్పుకుంది. ఆమె స్థానంలోకి నయనతార వచ్చి చేరింది. ఇక సందీప్ వంగా-ప్రభాస్ కాంబోలో మొదలు కాబోయే 'స్పిరిట్' చిత్రంలో ఈమెని హీరోయిన్‌గా అనుకున్నారనే విషయం ఎప్పటి నుంచో వినిపిస్తోంది. ఈ సంవత్సరం చివర్లో మొదలయ్యే 'స్పిరిట్' సినిమాలో ప్రభాస్‌కి జోడీగా కరీనా కపూర్‌ని హీరోయిన్‌గా ఫైనల్ చేసారని, ఈ యాక్షన్ ఎంటర్టైనర్ కోసం కరీనా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని సమాచారం. దీంతో పాటు రాజమౌళి-మహేశ్ కాంబో సినిమాకి సైతం కరీనా కపూర్ పేరు వినిపిస్తోంది.

ఏదేమైనా ఈ ఏడాది కరీనా కపూర్ సౌత్ ఎంట్రీ ఖాయమైనట్లే కనిపిస్తోంది. ఈ రెండు ప్రాజెక్ట్స్‌లో ఏది నిజమైనా అభిమానులకు సంబరమే!

**తారాతీరం**

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం 'ది రాజా సాబ్' సినిమాను శరవేగంగా తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాను దర్శకుడు మారుతి డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ చిత్రం తరువాతి సినిమాను దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో చేయనున్నాడు. అయితే ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికరమైన ఓ వార్త వినిపిస్తోంది.

# 'ఫౌజి'లో ఇద్దరు కథానాయికలా!



'ఫౌజి' సినిమాలో ప్రభాస్ సైనికుడి పాత్రలో నటిస్తున్నాడు. ఇందులో ఇమాన్విని ఇప్పటికే పరిచయం చేశారు మేకర్స్. ఈ చిత్రంలో మరో హీరోయిన్ కూడా ఉంటుందని, ఆ పాత్ర చాలా కీలకమనీ, ఆ కథానాయకురాలి ఎంపిక కూడా జరిగినట్లు సమాచారం.

'ఫౌజి' సినిమాలో నిజంగానే ఇద్దరు హీరోయిన్లు ఉన్నారా? లేదా? అన్న విషయం తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చేవరకు ఎదురు చూడాలి మరి!

ఆదివారం వార్త

29 సెప్టెంబరు, 2024

## మంచి ముత్యాలు

పగ సాధింపు చర్యలు ఆపితే నిన్నటి శత్రువులు రేపటి స్నేహితులు కాగలరు.

- గాంధీజీ

# విషయ విశేషం

ప్రకృతియే మన ఆయువు... 4

'సంఘీ'భావం....5

సంక్షోభంలో వ్యవసాయ రంగం

కవర్ స్టోరీ..6

చెరువంత
హైడ్రా

బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవాలు....10

ఈవారం కవిత్వం..12

నూరేళ్లు నిండకనే

కొన్ని దేశాల ప్రత్యేకతలు..14

కథ.. 20

ఎంతెంత దూరం

గాంధీజీపై డాక్యుమెంటరీ...24

సాహిత్యం.. 25

అమ్మ భాష మనుగడ కోసం..

అకారణ కోపం మంచిది కాదు... 26

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..

# తాజా వార్తలు

## సముద్రం నుంచి సూపర్ హీరోలు

మన శరీరాన్ని వ్యాధుల నుంచి రక్షించే సూపర్‌హీరోలు యాంటీబయాటిక్స్. జ్వరం, గాయాల నుంచి రక్షించడంతో పాటు శస్త్రచికిత్సల తర్వాత ఇన్‌ఫెక్షన్లు రాకుండా చేస్తాయివి. కానీ కొన్ని రకాల మొండి బ్యాక్టీరియాలు వీటిని కూడా జయించి బలోపేతం అవుతున్నాయి. అందుకే యాంటీ బయాటిక్స్‌ని శక్తివంతం చేసి, భవిష్యత్ తరాలని తీవ్రమైన ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షించే క్రమంలో ఓ ముందడుగు వేశారు ఫిన్‌లాండ్‌లోని హెల్సింకీ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. సాధారణంగా యాంటీబయాటిక్స్‌ని తయారు చేసేందుకు అవసరం అయిన యాక్టినో బ్యాక్టీరియా నేలమీదే దొరుకుతుంది. కానీ ఈ కొత్త పరిశోధనలో ఆర్కిటిక్ సముద్రంలోని బ్యాక్టీరియాని తీసుకుని దాన్నుంచి యాంటీ బయాటిక్స్‌ని తయారు చేశారు. ముందుగా ఐదేళ్లలోపు చిన్నారుల్లో డయేరియాని కలిగించే ఈ కొలి బ్యాక్టీరియాపై వీటిని విజయవంతంగా ప్రయోగించారు. సాధారణ యాంటీబయాటిక్స్‌తో పోలిస్తే ఈ సముద్ర జలాల నుంచి తయారు చేసిన జీవ ఔషధాలు జబ్బులని కలిగించే బ్యాక్టీరియా వృద్ధిని సమర్థంగా అడ్డుకుంటూ, వాటి శక్తిని వేగంగా నిర్వీర్యం చేస్తున్నాయట. దాంతో భవిష్యత్తులో బ్యాక్టీరియాతో వచ్చే వ్యాధులని అడ్డుకోవడం మరింత తేలికవుతుందని అంటున్నారు శాస్త్రవేత్తలు.



మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com

# ప్రకృతియే మన ఆయువు

నేదునూరి కనకయ్య

**విశ్వంలో** జీవరాశుల మనుగడకు మూలాధారం అయిన భూమి, ఆకాశం, గాలి, నీరు, నిప్పు అనే పంచభూతాలను ప్రకృతే ఈ విశ్వానికి అందించింది. పంచభూతాల నిష్పత్తిలో సమతుల్యత లోపించి మానవజీవనం అస్తవ్యస్తమౌతుంది. మానవాళి పలు విపత్తులకు గురౌతుంది. ప్రకృతి వాతావరణ పర్యావరణ సమతుల్యత మానవ మనుగడకు అత్యంత అవసరం. ఆధునికీకరణ 'పారిశ్రామికీకరణ పట్టణీకరణ' శీఘ్రంగా విస్తరిస్తున్న కార్పొరేటీకరణ 'శాస్త్ర' సాంకేతిక రంగాల్లో సంభవిస్తున్న పరిణామాలు ప్రకృతి విధ్వంసం దిశగా కొనసాగి పర్యావరణం పలు సవాళ్లను ఎదుర్కొంటుంది.

ప్రకృతి విధ్వంసం

మానవుడు తన భౌతిక అవసరాల కోసం తరతరాల ప్రకృతిని విధ్వంసం చేస్తున్నాడు. ప్రకృతి మీద ఆధిపత్యం సాధిస్తున్ననానే మాయలో పడి మానవ మనుగడకు ఆధారమైన ప్రకృతి రక్షిస్తే అది మనలను రక్షిస్తుంది అన్న వాస్తవాన్ని మరిచిపోవడం గమనార్హం. 'ప్రకృతి రక్షితే మానవ రక్షిత' అన్న సత్యాన్ని మరువకూడదు. మానవుడు చేసే చర్యలు భవిష్యత్ తరాలకు శాపంగా పరిణమించే ప్రమాదాన్ని గుర్తించకపోవడం శోచనీయం.

భారతదేశంలో ప్రకృతిని దేవతగా ఆరాధించే సంస్కృతి వుందన్న చారిత్రక సత్యాన్ని మరిచి పోకూడదు. ఆధునికీకరణ పేరుమీద ప్రకృతి సహజవనరులను విచక్షణారహితంగా అపరిమితంగా వినియోగిస్తూ పరిమితవనరులను కాలుష్యం చేస్తూ భావితరాల వారికి ఆర్థిక 'ఆరోగ్య సమస్యలను కానుకగా ఇస్తున్నాం. వారసులకు సంపద ఇవ్వాలని పోటీపడుతున్న సమాజంలో స్వచ్ఛత గల ప్రకృతి పర్యావరణాన్ని ఇవ్వాలన్న స్పృహ లోపించింది. సుస్థిరాభివృద్ధికి తీవ్రవిఘాతం కలిగించే ధోరణిని సమాజం విడనాడాలి.

## అటవీ క్షీణత పెరుగుతున్న కాలుష్యం

విచక్షణారహితంగా అటవీ సంపదను ధ్వంసం చేయడం కొల్లగొట్టడం వల్ల 33శాతం వుండాల్సిన అడవులు నేడు దేశంలో 21శాతానికి మించిలేవు. సగటున రోజుకు 333 ఎకరాల అటవీభూమి అదృశ్యమైపోతున్నట్ల సర్వేలు చెబుతున్నాయి. విచక్షణరహితంగా అటవీ సంపదను విధ్వంసం చేయటం వల్ల ప్రకృతి విపత్తులు 'అకాల వర్షాలు వరదలు వచ్చి అపారమైన' ఆస్తినష్టం ప్రాణనష్టం సంభవిస్తుంది. మానవ చర్యలవల్ల గాలి కాలుష్యం అవుతుంది. గాలి కాలుష్యం వల్ల ప్రతియేటా 70లక్షల మంది మృత్యువాత పడుతున్నారని వరల్డ్‌హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్ఒ) తన నివేదికలో వెల్లడించింది. వరదలు, వానలవల్ల కలుషితమైన నీరుతాగి రోగాల బారిన పడి ఏటా 2లక్షలమంది చనిపోతున్నారని నీతిఆయోగ్ గణాంకాలు తెలియచేస్తున్నాయి. వ్యవసాయ పారిశ్రామిక రంగాల విస్తరన వల్ల 85శాతం చిత్తడి నేలలను ప్రపంచం కోల్పోయింది. 75శాతం భూఉపరితలం మార్పుకు లోనయ్యింది. 66శాతం సముద్ర విస్తీర్ణం ప్రభావితమైందన్న అధ్యయనాంశాలు ఆదోళన కలిగిస్తున్నాయి. ఆధునిక సౌకర్యాల పేరుమీద మానవుడు విలాస జీవితానికి అలవాటుపడి కాలుష్య కారకమైన వస్తువులను ఉపయోగిస్తూ పర్యావరణానికి హాని చేస్తున్నాడు.



పారిశ్రామికీకరణ పట్టణీకరణ విస్తరణ ఫలితంగా వాతావరణంలోకి అపరిమిత కర్బన, ఉద్గారాలు విడిచి పెట్టడం వల్ల భూగోళం అగ్నిగోళంగా మారి 'గ్లోబల్ వార్మింగ్' కారణమై ఓజోన్ పొర క్షీణతకు మానవ చర్యలే ప్రత్యక్షంగా కారణం కావడం అంతేగాకుండా మనకు ఊపిరిని ఇచ్చే వాయువును కూడా కాలుష్యభరితం చేశాం. పెరుగుతున్న వాయునీరు కాలుష్యంతో జబ్బులతో సతమతమవుతున్నాం. నదీజలాలు కలుషితమై తాగునీటి కొరత ఏర్పడింది. పంటల దిగుబడిలో కీలకపాత్ర పోషించే తేనెటీగలు..ఊరపిచ్చుకలు అంతరించిపోతున్నాయి. పంటల దిగుబడి తగ్గి ఆహారోత్పత్తి కొరత ఏర్పడి ఆహార విపత్తు ఏర్పడే ప్రమాదం ఉందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ప్రస్తుత పరిస్థితులను పరిశీలించిన ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్సర్వేషన్ ఆఫ్ నేచర్ అనే అంతర్జాతీయ సంస్థ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో తీవ్రపరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. యుద్ధప్రాతిపదికలో ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. ప్లాస్టిక్ వాడకం తగ్గించి, వాటికి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలి. **(మిగతా 19వ పేజీలో)**

## 'సంఘీ' భావం



# సంక్షోభంలో వ్యవసాయ రంగం

మన దేశం వ్యవసాయాధారిత ప్రాంతం. ఇక్కడి వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు ఉంది. వ్యవసాయ రంగంలో ఉపాధి పొందుతున్న వారి సంఖ్య పరిశ్రమల్లో కార్మికుల కన్నా రెట్టింపు ఉంటుంది. అనేక దేశాలు మన వ్యవసాయ ఉత్పత్తుల కోసం వేచి చూస్తుంటారు. అయితే కొన్ని ఉత్పత్తులను ఇతర దేశాలను దిగుమతి చేసుకోవడం వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించక ఇబ్బందులు కలుగుతున్నాయి. తాజాగా గుజరాత్ మార్కెట్‌లో చైనాలో ఉత్పత్తి చేసే వెల్లుల్లి చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. స్థానికంగా మన దేశంలో ఉత్పత్తి అవుతున్న వెల్లుల్లి గడ్డకంటే చైనా వెల్లుల్లి దాదాపుగా రెట్టింపు పరిమాణంలో ఉంటుంది. అదేవిధంగా వెల్లుల్లి రెమ్మలు కూడా పెద్దవిగా, ఆకర్షణీయంగా ఉంటాయి. పైగా ప్రత్యేకమైన హైబ్రీడ్ విధానాల్లో వీటిని పండించడం వల్ల ధరలో చాలా వ్యత్యాసం ఉంటుంది. ఇక్కడ మధ్యంతరంగా ఉండే వెల్లుల్లి సమారు వంద నుంచి 120 రూపాయలు ఉంటే చైనా వెల్లుల్లి అందులో సగం ధరకే మార్కెట్‌లో లభిస్తుంది. అయితే చూడటానికి ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ వాటి స్వభావాన్ని దగ్గరగా పరిశీలిస్తే దేశీయ వెల్లుల్లి అనేక రెట్లు నాణ్యత కనిపిస్తుంది. మనదేశంలో ఉత్పత్తి అయ్యే వెల్లుల్లి గడ్డలో రెమ్మలు దగ్గరగా ఉంటాయి. వాటిపై పొట్టును తీసిన వెంటనే వెల్లుల్లి ఘాటు వాసన వస్తుంది. అయితే చైనా వెల్లుల్లిలో ఆ రకమైన సువాసన గాని, ఘాటుతనం కాని ఉండదు. వంటల్లో వాడే సమయంలో ఈ వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోందని గుజరాతీయులు స్పష్టం చేస్తున్నారు. చైనా నుంచి పెద్ద సంఖ్యలో వెల్లుల్లి దిగుమతి అయితే మన మార్కెట్‌లో స్వదేశీ వెల్లుల్లికి సంక్షోభం ఏర్పడుతుంది. విదేశాల నుంచి దిగుమతి అయ్యే ఉత్పత్తులు ఇక్కడ ధర పెరిగినప్పుడు మాత్రమే విపణిలో దర్శనమిస్తాయి. రేట్లు పడిపోతే దిగుమతులు నిలిచి పోతాయి. దీనివల్ల మంచి ధర పలుకుతున్నప్పుడు మన రైతులు నష్టపోతారు. వ్యవసాయంలో లాభనష్టాల స్థాయి అత్యధికంగా ఉంటుంది. ఉదాహరణకు టమోటాను పరిశీలిస్తే కొన్ని సందర్భాల్లో కిలో 200 రూపాయలు పలుకుతాయి. నెల రోజుల వ్యవధిలో ఒక్కసారిగా కిలో పదిరూపాయలకు పడిపోతుంది. ధరలు పడిపోయినప్పుడు నష్టపోయిన రైతులుపెరిగినప్పుడు కొంతసొమ్ము చేసుకుని ఆర్థికంగా నిలబడతారు. అయితే విదేశాల నుంచి ఉత్పత్తులు దిగుమతి అయ్యే సమయంలో ఈ హెచ్చుతగ్గుల చాలా తక్కువగా ఉంటాయి. దీనివల్ల మన దేశంలో రైతులు తీవ్రంగా నష్టపోతారు. గత రెండు దశాబ్దాల లెక్కలను పరిశీలిస్తే వ్యవసాయ రంగంతో ఉత్పత్తులు ఇప్పటికే 20 శాతం వరకు తగ్గాయి. వ్యవసాయం గిట్టుబాటు కాదని రైతులు తమ పిల్లలను ఐటీ ఉద్యోగాలకు ప్రోత్సహించడం, వ్యవసాయ భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు ఏర్పడటం వంటి అంశాలవల్ల వ్యవసాయం కుదించుకుపోతోంది. మరోపక్క గిట్టుబాటు ధర రాక రైతులు అవస్థలు పడుతున్నారు. ఇలాంటి తరుణంలో విదేశీ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తే రైతుల మెడకు ఉరితాడు వేసినట్లు అవుతుంది. 1970 వరకు పెద్ద ఎత్తున బియ్యాన్ని దిగుమతి చేసుకుంటే ప్రస్తుతం నూనెలు, పప్పులు, దిగుమతి చేసుకుంటున్నాం. నూనె గింజల సేద్యం విస్తీర్ణత, ఉత్పత్తి పెరగకపోవడం వల్ల మన దేశంలో వంట నూనెల కొరత ఏర్పడి దిగుమతులపై ఆధారపడాల్సి న పరిస్థితి ఏర్పడింది. దేశంలో అన్ని రకాల సాధారణ బియ్యం ఎగుమతులపై నిషేధం విధించి, మేలు రకాల బియ్యం ఎగుమతి అనుమతించడంతో బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దేశ ప్రయోజనాలకు అనుకూలమైన స్వంత వ్యవసాయ విధానాలు అమలుజరిపి, ఆహార పంటల్లో సమతుల్యత పాటించి వేలు రకం విత్తనాలతో కందులు, మినుములు, వేరుశెనగ, సన్ ఫ్లవర్ ఆయిల్, నువ్వుల పంటల విస్తీర్ణత పెంచి వాటటి దిగుబడులు పెరిగేలా చేసి స్వయం సమృద్ధిని సాధించినప్పుడే పప్పుల, నూనెల ధరలు తగ్గుముఖం పడతాయి. ప్రధానంగా మన దేశంలో వ్యవసాయాభివృద్ధి రేటు గణనీయంగా పడిపోతోంది. నిర్దేశిత లక్ష్యాల సాధనలో ప్రతి సంవత్సరం ఆశించిన ఫలితాలు సాధించలేకపోతున్నారు. మద్దతు ధరలు స్వల్పంగా పెంచినప్పటికీ ధాన్యం కొనుగోలులో భరోసా లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ముఖ్యంగా పెరుగుతున్న జనాభాకు సరిపోయే పరిణామంలో ఆహార ధాన్యాలను పండించలేకపోవడం, దిగుమతులు పెరిగిపోవడం వంటి కారణాల వల్ల రైతులకు ప్రోత్సహం దక్కడం లేదు. నాలుగైదు సంవత్సరాలుగా పరిశీలిస్తే ఆహార ధాన్యాల పెరుగుదల కేవలం 15 లక్షల టన్నులు మాత్రంగానే ఉంది. డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తులు లేకపోవడంతో దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోంది. దీనితో విదేశీమారక నిల్వలు కోల్పోవాల్సి వస్తోంది. ముఖ్యంగా చిరు, తృణధాన్యాలు, పప్పులు, నూనెగింజల దిగుమతుల కారణంగా వ్యవసాయ రంగం ఆర్థికంగా నష్టపోతోంది. కనీస మద్దతు ప్రకటించి రైతులకు ప్రభుత్వాలు అండగా నిలిచి తగిన ప్రోత్సాహం ఇస్తే అద్భుతాలు సృష్టించ డానికి అన్నదాతలు సిద్ధంగా ఉన్నారు. వరి వేస్తే ఉరి, వ్యవ సాయం దండుగ వంటి పిలుపులను స్వయంగా ప్రభుత్వాలే చెప్ప డంతో రైతన్నలు మానసిక ఆందోళనకు గురౌతున్నారు. ముఖ్యం గా కాలం చెల్లిన రైతు విధానాలను రద్దు చేసి, నూతన జాతీయ ఆధునిక వ్యవసాయ విధానం అమలుచేస్తే అటు రైతులకు న్యాయం జరగడంతో పాటు ధరలు అదుపులోకి వస్తాయి. మరోపక్క దిగుమతులు తగ్గడం వల్ల విదేశీమారక నిల్వలను సమృద్ధిగా పెంచుకునే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ




# చెరువంత హైడ్రా

**కవర్ స్టోరీ**

**మాదగాని మహేష్**

**హైడ్రా ..ఇప్పుడు దీనిచుట్టే చర్చ అంతా..! హైడ్రా ఏర్పాటైన కొద్ది రోజుల్లోనే దూకుడుగా ముందుకెళ్తుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అక్రమ కట్టడాలను బుల్డోజ్ చేసేపనిలో పడింది. పాత,కొత్త అనే తేడా లేకుండా ..కబ్జా అని తేలితే చాలు సీన్‌లోకి ఎంట్రీ ఇచ్చేస్తుంది. అయితే అసలు హైడ్రా ఏంటీ ..దాని విధివిధానాలు ఏంటో చూద్దాం.**

## అసలు హైడ్రా అంటే ..

హైడ్రా అంటే హైదరాబాద్ 'డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్' ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలో నుంచి 2024 జూన్‌లో ఏర్పాటైంది. హైదరాబాద్ నగర పరిసరాల్లోని చెరువులు కబ్జాకు గురికాకూడదనే ప్రధాన లక్ష్యంతో దీన్ని ఏర్పాటు చేశారు. చెరువుల పరిరక్షణ అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటైన హైడ్రా పరిధి ఔటర్ రింగ్‌రోడ్ (ఓఆర్‌ఆర్)వరకు విస్తరించి ఉంటుంది.

## చైర్మన్‌గా ముఖ్యమంత్రి..కమిషనర్‌గా రంగనాథ్

హైడ్రాకు చైర్మన్‌గా ముఖ్యమంత్రి వ్యవహరిస్తారు. అంతేకాకుండా ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల మంత్రులు ఇద్దరు ఇందులో సభ్యులుగా ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డిజిపి, ప్రిన్సిపల్ సెక్రటరీ, జిహెచ్‌ఎంసి మేయర్‌కి కూడా ఇందులో చోటు కల్పించారు. దీనికి హైడ్రాకు సీనియర్ ఐపిఎస్ అధికారి ఏవీ రంగనాథ్ కమిషనర్‌గా నియమించారు. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో జిహెచ్‌ఎంసిలో ఏర్పాటు చేసిన డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డిఆర్‌ఎఫ్) విస్తృత పరిచి, ప్రత్యేక అధికారాలు కల్పించి హైడ్రాను ఏర్పాటు చేశారు. దీనికి అదనంగా సిబ్బందిని కేటాయించి ఈటీమ్‌ను 800నుంచి 2,200 మందికి పెంచారు. ఈటీంను కమిషనర్ రంగనాథ్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏయుడి) ప్రిన్సిపల్ సెక్రటరీ పర్యవేక్షిస్తారు. అలాగే హైదరాబాద్‌ను మూడు జోన్లుగా విభజించి హైడ్రాకు ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసిన ఒక్కోజోన్‌కు ఏసిసి స్థాయి అధికారి పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

## హైడ్రా ఏం చేస్తుంది...

విపత్తుల నిర్వాహణతోపాటుగా ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, చెరువులు, నాలాల కబ్జాలకు అడ్డుకట్ట వేయడం, అక్రమ నిర్మాణాలు తొలగించడం, నిబంధనలు పాటించకుండా ఏర్పాటు చేసే ప్లెక్సీలు, హోర్డింగ్‌లు ప్రకటనల తొలగింపు వంటికి కూడా హైడ్రా కిందకి వచ్చాయి. ఇప్పటికే పని ప్రారంభించిన హైడ్రా చాలా చోట్ల నిర్మాణాలను కూల్చి వేస్తుంది. ఇప్పుడిప్పుడే సీన్‌లోకి ఎంట్రీ ఇచ్చిన హైడ్రా మొదట అక్రమ నిర్మాణాలపై కొరఢా ఝులిపిస్తుంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో ఉన్న చెరువులు రికార్డులు అన్ని పరిశీలిస్తుంది.

గత రికార్డుల ప్రకారం ఎన్ని ఎకరాల్లో విస్తరించి ఉండేది..? ప్రస్తుతం ఎంత ఉందనే దానిపై ఆరా తీస్తుంది.. క్షేత్రస్థాయిలోకి వెళ్ళి పరిశీలిస్తుంది. అలాగే ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక వ్యవస్థను కూడా తీసుకువచ్చే అవకాశం ఉందని తెలుస్తుంది. అయితే వాస్తవానికి చెరవులు, పార్కులు, ప్రభుత్వ భూములు కాపాడటం అంత ఈజీ కాదు. ఇప్పటికే ఎన్నోభూములు ఆక్రమణలకు గురయ్యాయి. వాటిల్లో కొన్నింటిని గుర్తించి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అయితే తాజాగా ఏర్పాటైన హైడ్రాకు ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయి.

హైదరాబాద్‌పరిధిలో ఎన్నో కట్టడాలు రాజకీయ నాయకుల కనుసన్నల్లోనే జరిగాయి. ఇప్పుడు వాటిని కూల్చివేయడం చాలామంది నేతలకు మింగుడు పడటం లేదు.

**హైడ్రాలో ఏజెన్సీ 3 ప్రధాన విభాగాలు..**

## అసెట్ ప్రొటెక్షన్ వింగ్..

ఇది పార్కులు, బహిరంగ ప్రదేశాలు, ఆటస్థలాలు,సరస్సులు, ల్యాండ్ పార్శిల్స్ (ప్రత్యేక అవసరాల కోసం ప్రభుత్వం సమీకరించిన భూమి) లాంటి ఆస్తులను ఆక్రమణల నుంచి కాపాడుతుంది. ప్రైవేట్ భవంతులను తనిఖీ చేసి, అవి భవనాలు, పట్టణ ప్రణాళిక నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయో లేదో పరిశీలిస్తుంది. ఒకవేళ చట్ట విరుద్ధమైన నిర్మాణాలుగా తేలితే కూల్చివేత చర్యలకు ఆదేశిస్తుంది.

## విపత్తు నిర్వహణ విభాగం..

ఈవిభాగం ప్రకృతి విపత్తు సమయాల్లో చర్యల్లో పాల్గొంటుంది. బాధితులకు సాయం, పునర్నిర్మాణ కార్యక్రమాలను సమన్వయం చేస్తుంది. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డిఆర్ఎఫ్) ద్వారా వీటిని నిర్వహిస్తారు. ఈటీమ్ ఎన్‌డిఆర్ఎఫ్, రాష్ట్ర ఏజెన్సీలతో కలిసి పనిచేస్తుంది. దీంతోపాటు ఐఎండి, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ(ఎన్ఆర్ఎస్ఎ )లాంటి సాంకేతిక ఏజెన్సీలతో సమన్వయం చేసుకుని పనిచేస్తుంది.

## లాజిస్టిక్ సపోర్టు వింగ్ ..

ఇది తెలంగాణ కోర్ అర్బన్ ఏరియా (టిసియుఆర్) పరిధిలో డిజాస్టర్ రెస్పాన్స్ ఇన్ఫర్మేషన్ అందిస్తుంది. డిజాస్టర్ రెస్పాన్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ద్వారా ఎప్పటికప్పుడు వచ్చిన సమాచారాన్ని క్రోడీకరించి తదుపరి చర్యలను నిర్ధేశిస్తుంది.

## మూడంచెల కార్యాచరణ..

నీటివనరుల సంరక్షణకు మూడంచెల కార్యాచరణ హైడ్రా అమలుచేస్తుంది. మొదటిదశలో పూర్తిస్థాయి నీటి మట్టం, బఫర్‌జోన్లలో కొత్త నిర్మాణాలు అడ్డుకోవడం, కబ్జాదారుల విషయంలో కఠినంగా వ్యవహరించడం చేస్తుంది. రెండో దశలో ఇప్పటికే కట్టిన నివాసాలు, ఇతర నిర్మాణాల అనుమతులు రద్దు చేయడంతోపాటు వాటికి అనుమతించిన అధికారులపై చర్యలు తీసకుంటుంది. ప్రతి చెరువుకు కూడా నీరు నిల్వ ఉండే ప్రాంతం లేదా నీరువిస్తరించే ప్రాంతాన్ని ఫుల్‌ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టిఎల్)అని అంటారు. ఆతర్వాత చెరువు పరిధిని బట్టి కొన్నిమీటర్ల బఫర్‌జోన్ ఉంటుంది. ఇప్పటివరకు ముఖ్యంగా ఫంక్షన్‌హాల్స్, ఫామ్‌హౌజ్‌లతోపాటు కమర్షియల్ ప్రాపర్టీలు, నూతనంగా నిర్మిస్తున్న భవనాలపై దృష్టిసారిం చారు. ఇప్పటికే అక్కడ నిర్మాణాలు చేపట్టి నివాసం ఉంటున్న పేద, మధ్యతరగతి ప్రజల విషయంపై ప్రభుత్వంతో చర్చిస్తు న్నామని తెలుపుతున్నారు. అయితే చెరువుల్లో ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్‌లలో పట్టా భూములు కూడా ఉన్నాయి. కానీ ఆ పట్టా భూముల్లో నీటిపారుదలశాఖ నిబంధనల ప్రకారం అక్కడ





శాశ్వత నిర్మాణాలు చేపట్టకూడదు. కేవలం వ్యవసాయం, మొక్కలు పెంచుకోవడం, నర్సరీలు ఏర్పాటు చేసుకునేందుకు మాత్రమే అనుమతి ఉంటుంది. దీనినే (ఎక్‌ఫసల్) పట్టా అంటారు. కానీ పలువురు పట్టాదారులు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లలో అక్రమంగా శాశ్వత నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు సాగిస్తున్నారు.

## ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్ అంటే..

చెరువు ఫుల్‌ట్యాంక్ లెవల్‌ను ఎఫ్‌టిఎల్‌గా పేర్కొంటారు. అంటే ..చెరువు కట్ట ప్రాంతం. మరింత వివరంగా చెప్పాలంటే ఒక చెరువు నిండు కుండలా ఉన్నప్పుడు నీళ్లు ఎక్కడి వరకు వెళ్తాయో ఆ మొత్తం ఎఫ్‌టిఎల్‌గా పేర్కొంటారు. దీన్ని ఎక్కువగా చెరువు కట్ట, అలుగు పోసే ప్రాంతాల ఎత్తున బట్టి లెక్కిస్తారు. ఈప్రాంతమంతా నీటిపారుదలశాఖ విభాగం కిందకు వస్తుంది. ఈప్రాంతాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. ఇటీవల చెరువు కట్ట ప్రాంతాల్లో (లేక్‌వ్యూ) పేరుతో బడా నిర్మాణాలు వెలుస్తున్నాయి. అయితే వీటిలో ప్లాట్లు కొనే ముందు కొనుగోలుదారులు కొన్ని కీలక పాత్రలు చూడాలి. లేకుంటే మొదటికే మోసం వస్తుంది. ఈప్రాంతంలోని నిర్మాణాలకు నీటిపారుదలశాఖ నుంచి ధృవీకరణ పత్రాన్ని (ఎన్‌వోసి)తీసుకోవాలి. అలాగే సంబంధిత మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ (ఎంఆర్‌వో), జిహెచ్‌ఎంసి క్లియరెన్స్ తప్పనిసరి. ఈమూడు ప్రాంతాల్లో ఏఒక్కటీ లేకపోయినా సంబంధిత స్థలాన్ని స్వాధీనం చేసుకునే హక్కు ప్రభుత్వానికి ఉంది. ప్లాట్లు కొన్న కొనుగోలుదారులు కోర్టుకు వెళ్ళినా లాభముండదు. బఫర్‌జోన్ అంటే నీటిపరివాహక ప్రాంతం. చెరువుల నుంచి పల్లపు ప్రాంతాలకు పారుతుంటుంది. దీన్ని అలుగు అంటారు. ఇక్కడి నుంచి పొలాలకు నీరు మళ్లుతుంటుంది. ఈమధ్య ఉన్న ప్రాంతం అంటే చెరువుకు, పొలాలకు మధ్య ఉన్న ప్రాంతాన్ని బఫర్‌జోన్ అంటారు. అయితే చెరువులో నీటి వనరుల ఆధారంగా బఫర్‌జోన్ నిర్ణయిస్తారు. రూల్ బుక్‌లో పేర్కొన్న దాని ప్రకారం సదరు చెరువు 25హెక్టార్లు అంతకు మించి విస్తీర్ణం ఉంటే 30మీటర్లు వరకు లెక్కిస్తారు.



ఉస్మాన్‌సాగర్ కింద ఉన్నభూములన్నీ బఫర్‌జోన్ కిందకే వస్తాయి. ఈప్రాంతాల్లో కట్టడాలు నిర్మించకూడదు, కొనకూడదు.

**మొత్తం చెరువులు 1728...మిగిలింది 700లోపే..**

ఒకనాడు నిండు చెరువులతో వాటి పక్కనే తోటలతో కళకళలాడిన నగరం హైదరాబాద్ కానీ నాటి చెరువులు కుంటలు ఉండేవి. ఇప్పుడు కుంటలన్నీ బస్తీలుగా మారాయి. చెరువులు కనిపిస్తే చెరపట్టడమే లక్ష్యంగా చెలరేగిపోయి కబ్జాదారులతో ఎక్కడికక్కడ భారీ నిర్మాణాలు వెలిశాయి. గత 45ఏళ్లలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 61శాతం చెరువులు మాయ మైపోయినట్లు "నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సి) తేల్చింది. దీనికి సంబంధించి ఇటీవల హైడ్రాకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చింది. గ్రేటర్ పరిధిలోని మూడు జిల్లాల్లో 1,728 చెరువులు ఉండాల్సి ఉండగా అందులో మిగిలినవి 700లోపే ఉన్నట్లు వివరించింది. గత 45ఏళ్లలో నామరూపాలు లేకుండా పోయినవి వెయ్యికిపైగా ఉన్నట్లు తేల్చింది. మిగిలిన చెరువుల్లో సగం దాకా కబ్జాలు, ఆక్రమణలే ఉన్నట్లు గుర్తించింది.



**ఇప్పుడు అధికారులు ఏం చేస్తున్నారు?**

రాజధాని నగరంతోపాటు పరిసర ప్రాంతాల్లో చెరువుల పరిరక్షణకు అధికారులు కొత్త పంథా అనుసరిస్తున్నారు. హైడ్రాతోపాటు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి వాటి సరిహద్దులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతిచెరువు విస్తీర్ణం, ఫుల్‌ట్యాంక్ లెవల్, బఫర్ జోన్‌ల పరిధులను డిజిటల్ యంత్రాలతో సర్వేచేసి ఆయా మ్యాప్‌లను హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌లో పెడుతున్నారు. ఎవరైనా ఆక్రమణకు పాల్పడితే డిజిటల్ సాక్ష్యాల ఆధారంగా వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు క్రిమినల్ చర్యలు తీసుకోనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ప్రతిచెరువు వద్దకు అధికారులు వెళ్ళి అక్కడి పరిస్థితులు పరిశీలిస్తున్నారు. చెరువుల వివరాలు సేకరించి ఎఫ్‌టిఎఫ్, బఫర్‌జోన్ జోన్లను సూచిస్తూ బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు.

**వెయ్యికోట్ల విలువైన భూములకు విముక్తి..**

నగరంలో ఆక్రమణలకు గురైన సుమారు వెయ్యికోట్ల విలువైన భూములకు ఇప్పటివరకు హైడ్రా విముక్తి కల్పించింది. జూన్ 27నుంచి ఇప్పటివరకు సుమారు 30ప్రాంతాల్లో 300లకుపైగా ఆక్రమణలు కూల్చివేసి సుమారు 150 ఎకరాల వరకు స్వాధీనం చేసుకుంది. మార్కెట్‌లో వాటివిలువ 1000-1500కోట్లు ఉంటుంది. పలుఖరీదైన ప్రాంతాల్లోనూ ప్రభుత్వ భూమిని హైడ్రా స్వాధీనం చేసుకుంది. మాదాపూర్‌లో తుమ్మిడికుంటలో 4.9 ఎకరాలు, జూబ్లీహిల్స్ నందగిరి హిల్స్ కాలనీలో 0.18 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని, బంజారాహిల్స్ లోటస్‌పాండ్ పార్కులో 0.16 ఎకరాలు, చందానగర్ ఈర్లచెరువులో 0.16ఎకరాలు, శాస్త్రీపురం బుమ్రుఖ్ నుద్దౌలా చెరువులో 13ఎకరాలు, ప్రగతినగర్ ఎర్రకుంట చెరువులో 0.29 ఎకరాలు వాటితోపాటు గండిపేట్ జలాశయంలో 15.5 ఎకరాలు, అమీన్‌పూర్ చెరువులో 51.78 ఎకరాలు, మాదాపూర్‌లోని సున్నం చెరువులో 10ఎకరాలు ,దుండిగల్ మల్లంపేట్ చెరువులో 2.5 ఎకరాలు, రాజేంద్రనగర్ అప్పాచెరువులో 3.2 ఎకరాలు, ఇతరత్రా విలువైన భూములను ఆక్రమణ నుంచి రక్షించినట్లు ప్రభుత్వానికి తెలిపింది. అయితే హైడ్రా కూల్చిన అక్రమ నిర్మాణాల్లో ఎక్కువగా రాజకీయ ప్రముఖులు, వ్యాపార వేత్తలు విల్లాలు, వసతిగృహాలు, వ్యవసాయ క్షేత్రాలు, కన్వెన్షన్ హాళ్ళు, గోదాములు, అపార్ట్‌మెంట్, వ్యక్తిగత గృహాలు, రేకుల షెడ్లు ఉన్నట్లు పేర్కొంది.

**నిర్మాణదారుల్లో దడ ..**

ఎప్పుడు ఎక్కడి నుంచి వచ్చి తమ అక్రమ కట్టడాలను నేలమట్టం చేస్తారోనని భయంతో పలువురు భూఆక్రమణదారులు గజగజ వణికిపోతున్నారు. ఏర్పాటైన కొద్దిరోజుల వ్యవధిలోనే తన విధానమేంటో స్పష్టం చేసిన హైడ్రా..సామాన్య ప్రజల నుంచి బడా నేతలు, సెలబ్రెటీలకు చెందిన అక్రమ కట్టడాలను





కూల్చిపడేసింది. ఈనేపథ్యంలోనే ఎఫ్టీఎల్ ,బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారు... చెవుల సమీపంలో ఇళ్లు కొనుగోలు చేస్తున్న వారు ఆందోళన చెందుతున్నారు. తాము తీసుకునే ప్లాట్ సరైందేనా కాదా..మేం ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్‌లలో ఉన్నామా లేదా అని తెలుసుకునేందుకు హైడ్రా కార్యాలయానికి పరుగులు తీసుకున్నారు. ఇటు అక్రమ నిర్మాణాలు కూల్చి వేయడంతోపాటు ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్‌లో నిర్మాణాలకు అనుమతిచ్చిన అధికారుల వివరాలు సేకరించి వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తుంది.

**అధికారులపై చర్యలు తీసుకోవాల్సిందే..**

కబ్జాలు, ఆక్రమణలు కూల్చివేస్తున్న హైడ్రా చర్యలపై సంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు గతంలో ఈ దారుణాలకు కారణమైన ఆఫీసర్లపైనా చర్యలు తీసుకోవాల్సిందేనని సోషల్‌మీడియా వేదికగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఆయా ఆఫీసర్లకు ఇవి నిబంధనలకు విరుద్ధమని తెలియకుండానే అనుమతులు ఇచ్చారా ..తెలిసి ఎలా పర్మిషన్ ఇస్తారు అని ప్రశ్నిస్తున్నారు. హైడ్రాకు వచ్చిన ఫిర్యాదులు, శాటిలైట్ ద్వారా గుర్తించిన ఆక్రమణలపై పూర్తిస్థాయిలో ఎంక్వైరీ చేసి, నిర్మాణాలను కూల్చివేస్తూనే వాటికి పర్మిషన్ ఇచ్చిన ఆఫీసర్లపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని...అలా చేస్తేనే హైడ్రాలో సీరియస్‌నెస్ కనిపిస్తుందని చెబుతున్నారు. ఆతర్వాత ఇతర ఏ అధికారి అలాంటి కార్యకలాపాలకు పాల్పడాలంటే భయపడాలని పలువురు నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

**హైదరాబాద్ భవిష్యత్‌కు హైడ్రా గ్యారెంటీ : సిఎం రేవంత్‌రెడ్డి**



హైదరాబాద్ భవిష్యత్‌కు హైడ్రా గ్యారెంటీ అని సిఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటిం చారు. ప్రకృతిని కాపాడేందుకే హైడ్రాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైడ్రా ఏర్పాటు వెనక ఏరాజకీయ కోణం కానీ, వ్యక్తిగత స్వార్థం కానీ ఏమీ లేదన్నారు. పర్యావరణ పునరుజ్జీవనం కోసమే హైడ్రా ఏర్పాటైందని చెరువులు, కుంటలు, కాల్వలను ఆక్రమించి చేసిన నిర్మాణాల న్నింటినీ హైడ్రా కూల్చేస్తుందన్నారు. ఆ నిర్మాణాలను కూల్చే యడమే కాకుండా వాటన్నింటిని యథాతథ స్థితికి తీసుకువచ్చే బాధ్యతను ప్రభుత్వం హైడ్రాకు అప్పగించిందని పేర్కొన్నారు. ఒకప్పుడు లేక్‌సిటీగా పాపులరైన హైదరాబాద్ ఇప్పుడు ఫ్లడ్ సిటీగా మారిపోవడానికి గత ప్రభుత్వాల నిర్లక్ష్యంగా పేర్కొన్నారు. తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్‌లో కేరళ పరిస్థితి రాకూడదన్నదే ప్రభుత్వం ఆలోచనగా ఆయన చెప్పారు. భూమాఫియా పేదలను ముందుపెట్టి హైడ్రా లక్ష్యాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నం చేస్తుందని ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా హైడ్రా వెనక్కి తగ్గదని, భవిష్యత్‌లో మరింత బలోపేతం అవటానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. త్వరలో హైడ్రాకు చట్టబద్ధత కల్పించి అవసరమైన సిబ్బందిని సైతం సమకూర్చుతామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**చట్టం అందరికీ సమానమే :** హైడ్రా కమిషనర్ రంగనాథ్



హైడ్రా చేసే కార్యకలాపాలకు పార్టీలతో సంబంధం లేదని అన్నారు. చట్టం అందరికీ సమానమే. ఆక్రమణలకు ఎవరు చేసినా చర్యలు తీసుకుంటాం. అధికార పార్టీ వారిపైనా ఫిర్యాదులు వస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పలువురు కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎం నేతలు ఆక్రమంగా నిర్మించిన ఆస్తులపై చర్యలు తీసుకున్న విషయం మీకు తెలిసిందే. ఎవరు ఏ ఒత్తిడి తెచ్చినా తగ్గేది లేదు. అలాగే కబ్జాదారులకు సర్వేనెంబర్లు మార్చి, అనుమతులు ఇచ్చి, ఎన్వోసిలు జారీ చేసి ఆక్రమణ లకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకుంటా మన్నారు. ఇప్పటికే 6గురు అధికారులపై చర్యలు తీసుకున్నామని, ఇంకా అలాంటి వారు ఎవరైనా ఉంటే వారి జాబితా సిద్ధం చేస్తున్నామ న్నారు. వారిపైన కఠిన చర్యలు తీసుకుని భవిష్యత్‌లో ప్రభుత్వ భూముల్లో అనుమతులు ఇవ్వాలంటే భయపడేలా చూస్తున్నామని రంగనాథ్ పేర్కొన్నారు.


కార్టూని
స్టుల నుండి
ఆరోగ్య కరమైన
హాస్యాన్ని అందించే
కార్టూ న్లను

**కార్టూన్లకు ఆహ్వానం**

స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంప గోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపిం చాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:
ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080.
sunmagvaartha@gmail.com



# బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవాలు

ఇలా అనంతమహిమాన్వితమై కలియుగవైకుంఠం తిరుమల కొండల్లో స్వయంభువుగా అర్చనామూర్తిగా కొలువైన శ్రీమన్నారాయణుడే శ్రీవేంకటేశ్వరస్వామి. శ్రీవైకుంఠాన్ని వదలిపెట్టి అత్యంత భక్తవాత్సల్యంతో భువికి దిగివచ్చి పుణ్యక్షేత్రం వేంకటాచల శిఖరాలపై వక్షఃస్థల మహాలక్ష్మితో ఆవిర్భవించిన ఇలవేలుపుగా భక్తులను కటాక్షిస్తున్నాడు. అఖిలాండకోటి హ్మాండనాయకుడు, కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని కేవలం మానవులు మాత్రమేకాదు. బ్రహ్మాదిదేవతలు, ఋషిగణాలు, యక్షులు, కిన్నెరకింపురుషాది అనిమేషులు నిత్యం దర్శించుకుంటూ ఉన్నారు. వారివారి శక్తినిబట్టి కొండలరాయుడు ఏడుకొండలస్వామికి ప్రతిరోజూ ఉత్సవాలు, ఊరేగింపులు నిర్వహిస్తుంటారు. తిరుమలకొండపై ప్రతినిత్యం ఒక పండుగ వాతావరణం కనిపిస్తుంది. కలియుగం ఆరంభం నుండి శ్రీవేంకటేశ్వరస్వామికి రోజువారీ, వారం, పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవ ఉత్సవాలు, ఊరేగింపులు ఎన్ని జరుగుతున్నా, సంవత్సరానికి తొమ్మిదిరోజులు ఒకమారు జరిగే "బ్రహ్మోత్సవాలు"మాత్రం తిరుమల చరిత్రలోనే అత్యంత అపూర్వమైనవి, బ్రహ్మదేవుని చేత స్వయంగా జరిపించుకునే తొమ్మిదిరోజుల ఉత్సవాలు కావున బ్రహ్మోత్సవాలుగా ఆధ్యాత్మిక వాతావరణంలో జరుగుతాయి.

చాంద్రమానం ప్రకారం ప్రతి మూడవ సంవత్సరం అధికమాసం వస్తుంది. ఇలా వచ్చిన సందర్భంలో కన్యామాసం(భాద్రపదంలో) సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు, ఆశ్వయుజంలో దసరా నవరాత్రుల్లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయ వర్గాలు నిర్వహిస్తారు. ఏడుకొండలదేవునికి ఈ ఏడాది అక్టోబర్ 4వతేదీ నుండి తొమ్మిదిరోజులపాటు సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు మాత్రమే జరగనున్నాయి.

అధికమాసంలో మాత్రమే వార్షిక బ్రహ్మోత్సవాలతోబాటు నవరాత్రి బ్రహ్మోత్సవాల పేరుతో రెండు బ్రహ్మోత్సవాలను తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తుంది. ఈ ఏడాది సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదిరోజులు పాటు ప్రతిరోజూ ఉదయం వాహనసేవ 8గంటలకు ప్రారంభమవుతుంది. రాత్రి వాహనసేవ 7గంటలకు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశిష్టమైన, ప్రధానమైన గరుడవాహనసేవ అక్టోబర్ 8వతేదీ మంగళవారం సాయంత్రం 6.30గంటలకే మొదలవుతుంది. బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 3వతేదీ గురువారం సాయంత్రం అంకురార్పణం, 4న శుక్రవారం సాయంత్రం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు

"దైవంబితడని
తలచరో..."!
వీధులవీధుల
విభుడేగే నిధే
మోదముతోడుత మ్రొక్కరో జనులు
గరుధ్వజమదే కనకరథంబదె
అరదముపై హరి యలవాడే
యిరుదెసల నున్నాడు యిందిరయు భువియు
పరగ జగ్గములు పట్టరో జనులు
ఆడే రదివో యచ్చరలెల్లను
పాడేరు గంధర్వపతులెల్లా
వేడుకతో వీడే విష్వక్సేనుడు
కూడి యిందురును జాడరో జనులు
శ్రీవేంకటపతి శిఖరముచాయదే
భావింప బహువైభవములవే
గోవిందనామపుఘోషణ విడుచును
దైవంబితడని తలచరో జనులు

కలియుగ వైకుంఠవాసుడు....బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవ వైభవాన్ని పదకవితాపితామహుడు అన్నమయ్య తన కీర్తనల్లో కీర్తించిన తీరు అద్భుతం..పరమాద్భుతం. అదిగో వీధివీధినా సంచరిస్తున్న విభుడు శ్రీవేంకటేశ్వరుడు.ఓ భక్తజనులారా ముదమారా చేతులెత్తి మొక్కండి. అదిగో గరుడధ్వజంతో ఉన్న బంగారు తేరు.ఆ రథంలో విరాజిల్లుతున్న శ్రీవారి తేజోవైభవం చూడటానికి వేయికళ్ళయినా చాలదు. ఆయనకు ఇరువైపులా శ్రీదేవిభూదేవేరులు. భక్తులారా దివ్యమైన ఆ రథం పగ్గాలను పట్టుకుని లాగండి. ఆ రథం ముందు భాగంలో అప్సరసలు ఆడుతుండగా గంధర్వులు పాడుతున్నారు. వీళ్ళందరితో విశ్వక్సేనుడు వేడుకతో నడుస్తున్నారు. అదిగో మెరుపులతో ప్రకాశిస్తున్న వేంకటాచల శిఖరాలు. ఆ వేంకటపతి వైభవాలను తలుస్తూ గోవిందనామ ఘోషలు చేస్తూ అద్భుతమైన దేవుడని భావించి కొలవండి జనులారా! అని భావం.

## ఆనందదాయకం తిరుమలేశుని బ్రహ్మోత్సవం!

"నిత్యాత్ముడైయుండి నిత్యుడై వెలుగొందు-సత్యాత్ముడైయుండి
సత్యమై తానుండి
ప్రత్యక్షమైయుండి బ్రహ్మమైయుండు-సంస్తుత్యుడీ
తిరువేంకటాద్రి విభుడు"

ఆరంభమవుతాయి. తొలిరోజు అక్టోబర్ 4వతేదీ ధ్వజారోహణం రోజునే రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు తిరుమలకు చేరుకుని శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.



**ధ్వజారోహణం:**

"తొలిపూజ ,తొలి దర్శనం ఆది వరాహునికే"!:

కలియుగంలో తిరుమలదివ్యక్షేత్రంలో శ్రీనివాసుడి ఆలయానికి వాయువ్యమూలలో తూర్పుముఖంగా కొలువైన శ్రీవరాహస్వామి ఆలయం వుంది. శ్రీ మహావిష్ణువు ఆదివరాహస్వామిగా అవతరించి భూదేవిని రక్షించి ఇక్కడే నిలిచాడు.

**వాహనసేవల విశేషాలు:** బ్రహ్మదేవుడు స్వయంగా భూలోకానికి వచ్చి పరివార దేవతలతో కలిసి తొమ్మిదిరోజులు తిరుమలకొండపైనే వుండి శ్రీవేంకటేశ్వరునికి ఉత్సవాలు నిర్వహిస్తాడనే పురుణాల కథనం. ఈ తొమ్మిది రోజులు దేవదేవుడు శ్రీమలయప్పస్వామి ఉభయదేవేరులైన శ్రీదేవిభూదేవులతో కలిసి రోజుకు రెండు వాహనాలపై ఊరేగుతారు.

**"పెద్దశేషవాహనం":** బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజురాత్రి తొలివాహనంగా ఏడుతలల శేషునిపై ఉభయనాంచారులతో కలిసి విహరిస్తారు. స్వామిని నిత్యం కొలిచి సేవించే వారిలో శేషుడు ఒకడు.



**చిన్నశేషవాహనం:** రెండవరోజు ఉదయం మలయప్పస్వామివారు మాత్రమే ఐదుతలల చిన్నశేషవాహనంపై దర్శనమిస్తాడు. చిన్నశేషవాహనం వాసుకిగా భావిస్తారు. ఎల్లప్పుడూ శేషునిపై శయనించే స్వామివారు మళ్ళీ ప్రీతితో శేషవాహనంపై దర్శనమిస్తాడు.

**హంసవాహనం:** బ్రహ్మోత్సవాలలో రెండవరోజురాత్రి మలయప్పస్వామి వీణాపాణియై సరస్వతిమూర్తిగా దర్శనమిస్తారు. "హంస"పాలలోని నీళ్ళను వదలి పాలను త్రాగే విధంగా భగవంతుడు పాపాలను క్షమించి వాత్సల్యంతో దగ్గరికి చేరదీస్తాడని చెప్పడం కోసం ఈ హంసవాహనం పరమహంసుడైనవాడు పరమాత్మ.



**సింహవాహనం:**

ఉత్సవాల్లో మూడవరోజు ఉదయం శ్రీవారు సింహవాహనంపై దర్శనమిస్తారు. అనంతతేజోమూర్తి శ్రీనివాసుడు. రాక్షసుల మనస్సులలో సింహంలా గోచరిస్తాడని స్తోత్ర వాఙ్మయం కీర్తిస్తుంది.

**ముత్యపుపందిరి వాహనం:**

బ్రహ్మోత్సవాల్లో మూడవరోజు రాత్రి ముత్యపుపందిరి వాహనంపై ఏడుకొండలస్వామి ప్రత్యక్షమవుతాడు. ముత్యాలు విలువైనవి. చల్లదనాన్ని ప్రసాదిస్తాయి. తెల్లని కాంతులీనుతాయి. జ్యోతిషశాస్త్రం చంద్రునికి ప్రతీకగా ముత్యాలను ప్రశంసిస్తుంది.

**కల్పవృక్షవాహనం:** బ్రహ్మోత్సవాల వేళ నాల్గవరోజు ఉదయం మలయప్పస్వామి ఉభయనాంచారులతో కలిసి ఊరేగే వాహనం కల్పవృక్షవాహనం.

**సర్వభూపాలవాహనం:** ఏడడుగుల ఎత్తు, పూర్తిగా బంగారు రేకులతో నిర్మించిన వాహనం సర్వభూపాల వాహనం. దేవచోడవంశానికి చెందిన ముట్లకుమార అనంతరాయులు ఇచ్చిన వాహనాలలో ఇదొకటి. సర్వభూపాలురలలో దిక్పాలకులు కూడా చేరుతారు.

**గరుడవాహనం:** బ్రహ్మోత్సవాలలో అత్యంత విశిష్టమైనది...ప్రధానమైన గరుడవాహనసేవ ఐదవరోజురాత్రి అంగరంగవైభవంగా జరుగుతుంది.

**హనుమంతవాహనం:**

కొండలరాయుని ఉత్సవాలలో ఆరవరోజు ఉదయం స్వామివారు హనుమంతవాహనంపై ఊరేగుతాడు. త్రేతాయుగంనాటి రాముడు కలియుగంలో వేంకటేశ్వరుడని నిరూపించడం ఈ వాహనంలోని పరమార్థం.

**స్వర్ణరథం:** బ్రహ్మోత్సవాలలో స్వర్ణరథం అత్యంత ప్రధానం. కొయ్యరథానికి బంగారు కవచం వేయడంతో బంగారు రేకుల తాపడం రసాయనిక క్రియతో అతికించబడింది.

**గజవాహనం:**

ఆరవరోజురాత్రి శ్రీమలయప్పస్వామివారు గజవాహనంపై ఊరేగుతారు. మొసలిబారికి చిక్కిన ఏనుగును మహావిష్ణువు రక్షించడం, గజేంద్రమోక్షం.

**సూర్యప్రభవాహనం:**

బ్రహ్మోత్సవాలలో ఏడవరోజు ఉదయం మలయప్పస్వామివారు సూర్యప్రభవాహనంపై ఊరేగుతారు. సూర్యుడు కర్మసాక్షి. చరాచర ప్రపంచానికి వెలుగును ప్రసాదించే ప్రత్యక్షదైవం వేంకటేశ్వరుడు.

**(మిగతా 18వ పేజీలో)**



# నూరేళ్లు నిండకనే

## ఈవారం కవిత్వం

**పండిన** ఆకు రాలింది
నిండు జీవితం ఫలించి
తనువు చాలించింది
ఇన్నేళ్లూ కలిమిలేముల్లో
బిడ్డ కర్తయినందుకు
తనపై కురిసిన మంచును
తల్లిచెట్టు అశ్రువుగా రాల్చి
బిడ్డ మరణాన్ని ముద్దాడింది!
అత్యంత క్లేశం ప్రవేశమైంది
కన్ను తెరిచిన చిగురు
మర్నాడే కన్నుమూసింది
అకస్మాత్తు అస్తమయం వెనుక
లోగుట్టు పెరుమాళ్లకెరుక
గ్రీష్మాన్ని చవిచూడలేదు
వసంతాన్ని అనుభవించలేదు
వర్షంలో అభ్యంగన స్నానం చెయ్యలేదు
తుపాన్ని దర్శించలేదు
మంచును
ఆస్వాదించలేదు
బాల్యం కౌమార్యం వృద్ధాప్యం
అనుభవించక కీర్తిశేషమైంది!
పండిన కాయను
ఇంటిల్లిపాదీ జిహ్వాలకు రుచులద్ది
పెదాలపై కృతజ్ఞతారాతలు
చూడకనే చిగురు నిర్వాణం!
అల్పాయుష్షై చిగురు
అర్ధాంతరంగా ముగిసినందుకు
రెమ్మ దుఃఖితమై
కొమ్మపై వాలి కన్నీరు కార్చింది!
నిండు జీవితం చూడనందుకు
నూరంకె చింతిస్తూంది!

**– అడిగోపుల వెంకటరత్నమ్**

---

# నాన్న నానీలు

**ఆకాశంలో** పున్నమైనా
మా ఇంట్లో మాత్రం అమావాస్యే
నాన్న/ ఇంటికి రాలేదు.

ఇంటికి / సంధ్యా సూరీడై వస్తాడు
నాన్న/ తన ఆకాశాన్ని వదిలేసి.

నింగి చుక్కోటి/ రాలిపోయింది
నాన్న తిరిగొచ్చాడేమో
అన్న ఆశ కలిగింది.

నాన్న మాటెపుడూ
తీయనిదే/ అందుకే ఆయనంటే
అందరికీ దిల్ పసంద్.

మా నాన్న చేవ్రాత
అందంగా ఉండేది./
నదులు మెలికలు
తిరుగుతున్నట్టు.

నాన్న చొక్కాకు/ ఇస్త్రీ ఉండదు
కానీ మనసును/ మడతలు పడనీయడు.

సాగర తీరంలో/ అలల కేరింతలు
నాన్న భుజాలపై ఆడే/ పిల్లల్లా.

నాన్న గుండెంత/ బరువో!
నాన్న చొక్కా/ తొడుక్కున్నాకే తెలిసింది.

నేను పర్వతాన్ని/ అధిరోహించినవాణ్ని
నాన్న భుజాలపై/ ఎక్కినపుడు.

కుటుంబమంటే/ బాధ్యతల పల్లకీ
మోసేబోయి మాత్రం/ నాన్నొక్కడే.

**– శివకృష్ణ కొక్కుల**





## ఆలితో సరదాగా-హాస్య నాటికలు

'నవ్వు' అనే మందు తయారు చేయటం కష్టమైనా, నాకు ఇష్టం' అంటారు 'ఆలితో సరదాగా' హాస్య నాటికల రచయిత అద్దేపల్లి భరత్‌కుమార్. తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం పొందిన ఈ సంపుటిలో మూడు సీన్‌ల తర్వాత సరదా కోసం భార్యకు మందు అలవాటు చేసి వైవిధ్యభరిత మైన హాస్యం సృష్టించారు. 'నటీమణి కావలెను'లో పురుషులే స్త్రీ పాత్రల్ని ధరించే పాతరోజులు రాకుండా, నటీమణులను ఆదరించా లని హాస్యం ధ్వనింపచేస్తూ సూచించారు. 'మత్తు వదలరా'లో మందు సరదాలు పుష్కలంగా నవ్వింపచేస్తాయి. 'మా ఆవిడ బంగారం'లో హాస్యం సృష్టించడానికి పాత్రలను చాకచక్యంగా నడిపించారు. మద్యం దుకాణంలో, మందుల దుకాణాలలోని లభ్యంకాని నవ్వు అనే మందు పాత్రలపై డైలాగుల ద్వారా హావభావాలతో ఈ నాటికలలో రచయిత పండింపచేసారు. బాబాయ్, అంకుల్, డైరెక్టర్, ఎస్.ఐ., మామ, తండ్రి వంటి ప్రతీపాత్ర ప్రతినాటికలో డైలాగులతో హాస్య ప్రధానంగా నాటిక నడిపిస్తాయి. వేదికపై ప్రదర్శించటానికి, కడుపుబ్బ నవ్వించే హాస్యనాటికలు కరువవుతున్న ప్రస్తుతంలో, హాస్యరసస్ఫూర్తి కలిగించే నటనకు అవకాశం కల్పిస్తూ, సంభాషణలతో కేవలం చదవటానికే కాకుండా రంగస్థలంపై రంజింపచేసే చాతుర్యం రచయిత భరత్‌కుమార్ 'ఆకలి సరదాగా'లో ప్రదర్శింపచేసారు.

**(ఆలితో సరదాగా, రచన: అద్దేపల్లి భరత్‌కుమార్, వెల: రూ 150, ప్రతులకు: 101, లక్ష్మీహోమ్స్, శ్రీసాయికృష్ణ కాలనీ, రోడ్‌నం-2, ప్రగతినగర్, హైదరాబాద్)**

**- యర్రమిల్లి**

## పుస్తక సమీక్ష

## కృష్ణాజిల్లా సాహిత్య అక్షర తరంగిణి



ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన కవుల, రచయిత ల, జర్నలిస్ట్‌ల, పరిచయాలు ఫొటోలతో ఈ పుస్త కంలో ప్రచురించారు. 16 సంవత్సరాలు కృషి చేసి ఈ పుస్తకం రాసారు. ఈ పుస్తకాన్ని రచయిత తన తల్లిదండ్రులైన బ్రహ్మశ్రీ నవులూరి సూర్యనారాయణ వెంకట సామ్రాజ్య లీలావతి దంప తులకు అంకితం చేసారు. ఒక పుస్తకం రాసిన రచయితనూ పరిచయం చేయడం గొప్ప విషయాలు. ఉదాహరణకు అర్జున్, నగీనాలు 'విశ్వనాగేశ్వర స్వామి జీవిత చరిత్ర' రాసారు (పేజీ. 459) అంటారు. డా॥టి.వి.ఎస్. చలపతిరావు 'కాంగ్రెస్' అనే రహస్యపత్రిక విజయవాడ నుండి నడిపారు (పేజీ.422). ఇలాం టి తెలియక పరిశోధనాత్మక అంశాలు రాయడం గొప్ప అంశం. డాక్టర్ అయినవోలు మంజుల, ఇస్మాయిల్ ఉమ్మిషేక్, అన్నవరపు సుబ్బారావులాంటి పెద్దలు గురించి, వారికాలం, వివరాలు అంద కున్నా వారి రచనలు తెలియజేసారు. ఇలా దాదాపు 1309 కవులు, రచయితలేగాక, 696మంది కవులు, రచయితల గురించి వారి కాలం వివరాలు పరిచయం చేసారు. ఇంకా సాహిత్య, సాం స్కృతిక, పత్రికారంగాల్లో కృషి చేసిన వారి గురించి నాటకర్తల గురించి రాయడం అభినందనీయం. 1794లో కృష్ణాజిల్లా ఏర్పా టు దగ్గర నుండి ఎన్నో చారిత్రక అంశాలు రాసారు. ప్రతి కవి, రచయి త, జర్నలిస్ట్ పరిశోధకుల ఇంట తప్పక ఉండవలసిన విలువైన మహత్తర గ్రంథం..అందించిన రమేష్‌బాబు అభినందనీయం.

**(కృష్ణాజిల్లా సాహిత్య తరంగిణి, రచన: విద్వాన్ నవులూరి రమేశ్‌బాబు, వెల: రూ 750, ప్రతులకు: ప్రముఖ బుక్‌హౌస్‌లు) - తంగిరాల చక్రవర్తి**

## నిశాచరుడి దివాస్వప్నం

మల్లారెడ్డి మురళీమోహన్ స్వాప్నికుడు, భావుకుడు. ఈయన కవిత్వంలో నిద్రలుంటాయి. నిద్రపట్టని రాత్రులుంటాయి. దిండుకింద శకలాలుంటాయి, మెలకువలు, కలవరింతలూ వుంటాయి. అక్కడక్కడా పలకరింపులు వుంటాయి. లోలోపలి నిశాచరత్వంతో బాటు నిశాచరుడి దివాస్వప్నంలోని రాత్రీ, పగళ్ల దోబూచులాడ్తాయి. నింగి, నేల, నీరు, నిప్పు,



గాలి..యిలా పంచభూతాలన్నీ కవితల్ని ఆవహిం చి పాఠకుడ్ని ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. అతిథులు రాని ఇల్లు ఎలా ఉంటుంది? 'అవయవాలు తెగి పడ్డ గడియారపు ఆక్రోశంలా../పంటలేని క్షేత్రం లో పిట్టవాలని/ దిష్టిబొమ్మ నిరీక్షణలా../తేమకళ్ల యాచకుడి/ ఎండమావి యాతనలా వుంటుంది. నిజమే! ఆలోచిస్తే యింత నిస్సారంగానే వుంటుందని తోస్తుంది. 'వేసవిరాత్రి/ ఆమెశోకంలా వుంది/ ఆమె మౌనంలా వుంది/ ఆమె శాపంలా వుంది' అంటాడు ఓ కవితలో. చిన్నప్పుడు కవి ఊళ్ళో మొలిచిన గోడ ఇన్నాళ్ళ తర్వాత 'ఊళ్లో వున్నవాళ్లకి కొండగుర్తు/ ఊరొదలి వెళ్లినవాళ్లకి గుండెగుర్తు'గా మారిందని అంటాడు మల్లారెడ్డి. తిలక్, అజంతా, మో ప్రభృతుల కవిత్వంతో ప్రభావితుడైన మురళీమోహన్ తనదైన ప్రత్యేకశైలిలో కవనలోకంలో దూసుకెళ్తున్నాడు.

**(నిశాచరుడి దివాస్వప్నం, రచన: మల్లారెడ్డి మురళీమోహన్, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్) - రమణ వెలమకన్ని**

ఒరియా సాహిత్య ప్రపంచంలో లబ్ధప్రతిష్ఠులు శ్రీహృషీకేశ్‌పాండా. మారుతోన్న ప్రపంచం, వలసవాదంపై సృష్టించిన నవల 'స్వర్ణదీపం'. ఇంగ్లిషు సాహిత్యంలోని 'ఉటోపియా' నగరాన్ని తలపిస్తుంది స్వర్ణదీపం.

## దేశపరిణామాలను వివరించే పుస్తకం



లిపినాయక్ ఇంగ్లీషులోకి అనువదించగా, ప్రముఖ రచయిత్రి, పలు నవలలు, కవిత్వం, కథలు తెలుగులో అందించి ప్రజాదరణ పొందిన స్వాతీశ్రీపాద తెలుగులోకి అనువాదం చేసారు. దేశంలో నిన్న, నేడు నెలకొన్న పరిణామాలని ఈ నవల చక్కగా చిత్రిస్తుంది. పాలకులు అనుసరించే సాంస్కృతిక వ్యవస్థల్లో చోటు చేసుకుంటున్న మార్పులు వాటిలోని డొల్లతనం మూలరచయిత అధిక్షేపధోరణితో వివరించారు. తెలుగు సేత స్వాతీశ్రీపాద అనుసరణ కాకుండా అనువాదం చేసినట్లనిపిస్తుంది. అయితే విస్మరణీయం (116) సందడించటం (8) నిశ్శబ్దపరచటం (86)లాంటి పదాలు వాడ కుండా ఉంటే బావుండేదేమో! బ్రేక్‌ఫాస్ట్ పదునుపెట్టటం (60) లాంటి వాక్యాలు కొంచెం తికమక పెడతాయి. కథలో సంఘటనల కూర్పులో కంటిన్యూటీ లేకపోవడం వల్ల చదివేందుకు ఓపిక అవసరం.

**(స్వర్ణదీపం, అనువాదనవల, తెలుసేత: స్వాతీశ్రీపాద, వెల: రూ 150, ప్రతులకు: పాలపిట్ట బుక్‌హౌస్)**

**- కూర చిదంబరం**



గ్రీన్‌లాండ్, స్కాట్లాండ్, డెన్మార్క్‌లలో దోమలు పెద్ద సంఖ్యలో కనిపిస్తాయి. ఈ దేశంలో దోమలు లేకపోవడానికి ఇక్కడి ఉష్ణోగ్రతలే కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఐస్‌లాండ్ ఉష్ణోగ్రత మైనస్‌కి చేరుతుంది. దీంతో ఇక్కడ నీరు గడ్డకడుతుంది. అటువంటి పరిస్థితిలో దోమలు వృద్ధి చెందడం కష్టమవుతుంది. దోమలు వృద్ధి చెందాలంటే నీరు నిలువకావాల్సి ఉంటుంది. దోమల గుడ్ల నుండి

# కొన్ని దేశాల ప్రత్యేకతలు

ఏర్పడిన లార్వాలకు ప్రత్యేక ఉష్ణోగ్రత అవసరం. ఆ తర్వాత అవి దోమగా మారగలవు. ఐస్‌లాండ్ ఉష్ణోగ్రత దోమలు వృద్ధి చెందడానికి అనుగుణంగా లేదు. చరిత్రలో ఇక్కడ ఒక దోమను పట్టుకున్నారు. ఆ దోమను ఒక కూజాలో బంధించారు. నేడు ఈ కూజా ఐస్‌లాండిక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ హిస్టరీలో ఉంది. ఐస్‌లాండ్‌లో నీరు, నేల, పర్యావరణ వ్యవస్థలోని రసాయన మార్పులు కూడా దోమలకు సహకరించవు. అందుకే ఇక్కడి ప్రజలు దోమలు, పాముల భయం లేకుండా స్వేచ్ఛగా తిరుగుతుంటారు. నచ్చిన చోట క్యాంప్‌లు ఏర్పాటు చేసుకొని ఉల్లాసంగా గడుపుతుంటారు. విపరీతమైన చలి కారణంగా అంటార్కిటికాలో కూడా దోమలు కనపడవు.

**షేక్ అబ్దుల్ హకీం జాని**

## దోమలు లేని దేశం

దోమలు మనుషుల రక్తాన్ని పీల్చి అనారోగ్యాన్ని కలిగించే విషయం అందరికీ తెలిసిందే. కొన్ని దేశాలలో అక్కడి వాతావరణ పరిస్థితుల వల్ల దోమలు కనపడవంటే ఆశ్చర్యం కలగక మానదు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ, జికా వైరస్ ఇలా ఎన్నో రకాల రోగాలు దోమల నుంచే వస్తాయి. అందుకే ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం దోమలపై యుద్ధం చేస్తుంటాయి. వాటిని మట్టుబెట్టేందుకు ఎన్నో రకాల చర్యలు చేపడుతున్నాయి. అయినప్పటికీ దోమల సంఖ్య మాత్రం తగ్గడం లేదు. వాటివల్ల వచ్చే రోగాలూ పోవడం లేదు. కానీ ఒక్క దోమ కూడా లేని దేశం ఈ భూమి మీద ఉందంటే ఆశ్చర్యం కలగక మానదు.

## ఐస్‌లాండ్

ప్రపంచంలో పూర్తిగా దోమలు లేని దేశం ఐస్‌లాండ్. ప్రపంచ పటంలో చివరిభాగాన మానవుడు స్థిరపడిన ప్రదేశం ఇది. ఐస్‌లాండ్ గ్రేట్ బ్రిటన్ తర్వాత ఐరోపాలో రెండవ అతిపెద్ద ద్వీపదేశంగా కూడా ప్రసిద్ధి చెందింది. ఆ దేశంలో ఒక్క దోమ కూడా కనిపించదు. ప్రపంచ దోమల కార్యక్రమం నివేదిక ప్రకారం ప్రతి సంవత్సరం 700 మిలియన్లమంది దోమల ద్వారా వ్యాపించే వ్యాధితో బాధపడుతున్నారు. వీరిలో 10లక్షల మందికి పైగా మరణిస్తున్నారు. ఐస్‌లాండ్ దేశంలో మాత్రం ఒక్క దోమ కూడా కనిపించదు. ఐస్‌లాండ్‌లో దోమలు లేకపోవడానికి అక్కడి వాతావరణమే కారణం. ప్రపంచ అట్లాస్ నివేదిక ప్రకారం ఇతర దేశాలకంటే ఇక్కడ జనాభా తక్కువ. ఐస్‌లాండ్‌లో దాదాపు 1300 రకాల జీవులు కనిపిస్తాయి. కానీ దోమలు మాత్రం కనిపించవు. ఐస్‌లాండ్ పొరుగు దేశాలైన



## నదులు లేని దేశం

ప్రపంచంలో ఒక్కనది కూడా లేని దేశం సౌదీ అరేబియా. అవును సౌదీ అరేబియాకు నది లేదు. కానీ రెండు వైపులా సముద్రం ఉంది. దీని చుట్టూ పశ్చిమాన ఎర్ర సముద్రం, తూర్పున పర్షియన్ గల్ఫ్ ఉన్నాయి. నీరు లేకుంటే మనిషి మనుగడే కష్టంగా మారుతుంది. నదులు తాగునీటికి ఆధారం. ప్రపంచంలోని గొప్ప నాగరికతలు నదుల ఒడ్డునే అభివృద్ధి చెందాయి. కానీ నది అనేది లేకుండా అభివృద్ధి చెందిన దేశం సౌదీ అరేబియా. ఇక్కడ నదులు లేకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. సౌదీ అరేబియా ఇసుకతో నిండిన ఎడారి భూమి కావడం ఒక కారణం. సౌదీ రెండు నీటి వనరులు అందుబాటులో ఉన్నాయి.

భూగర్భ జలాలు, సముద్రపు నీటి నుండి ఉప్పును తొలగించే డీశాలినేషన్ ప్లాంట్ల నుండి సేకరించిన నీటిపై ఎక్కువగా ఆధారపడుతుంది. బావులు, బోర్‌వెల్‌లు మొదలైన వాటి రూపంలో సేకరించిన నీటి విస్తృత పొర ఉన్న భూమి క్రస్ట్ కింద భూగర్భజలాలు ఉత్పన్నమవుతాయి. సౌదీలో అక్కడక్కడా కొన్ని సరస్సులు కనిపిస్తాయి.

ఇక్కడ వర్షపాతం తక్కువగా ఉంటుంది. అంటే సంవత్సరంలో ఒకటి నుండి రెండు రోజులు మాత్రమే వర్షాలు కురుస్తాయి. వర్షం తక్కువగా కురవడం వల్ల భూగర్భ జలాలు అంత ఎక్కువగా లభించవు. సౌదీ అరేబియా కొంతమేరకు భూగర్భ జలాలపై ఆధారపడి ఉంది.

అక్కడ కొన్ని ప్రాంతాల ప్రజలు నీటి కోసం బావులను ఉపయోగిస్తున్నారు. దేశ జనాభాకు నీరు అందించడానికి భూగర్భ జలాలు సరిపోవు. ఆ కారణంగా సముద్రపు నీటిని శుద్ధి చేసి గృహ అవసారాల కోసం, కొంత మేరకు తాగడానికి ఉపయోగిస్తారు. సముద్రపు ఉప్పునీటిని శుద్ధి చేయడం అనే ప్రక్రియ చాలా ఖరీదైనది. ప్రపంచబ్యాంకు నివేదిక ప్రకారం సౌదీ అరేబియా ప్రతి సంవత్సరం తన దేశ ఆదాయంలో రెండుశాతాన్ని నీటి కోసం ఖర్చు చేస్తుంది. సౌదీ భూగర్భంలో ముడిచమురు వంటి ఇంధనాలు ఎక్కువగా లభిస్తాయి. అక్కడక్కడా నీళ్ల దొరుకుతాయి. అందువల్ల ఖరీదైన ప్రక్రియ అయినప్పటికీ ఇక్కడ సముద్రపు నీటిని శుద్ధి చేసి గృహ అవసరాలకు ఉపయోగిస్తారు. తాగునీటిని కొన్ని దేశాల నుండి దిగుమతి చేసుకుంటారు. ఇక్కడ లభించిన చమురును ఇతర దేశాలకు ఎగుమతి చేసి అక్కడ నుండి మంచినీళ్లను తమ దేశానికి దిగుమతి చేసుకుంటారు. సౌదీలోని పవిత్ర నగరం మక్కాలో జమ్ జమ్ జల నిధి ఉంది. కొన్నివేల సంవత్సరాల నుండి ఈ బావి నుండి నీళ్లు తోడుకుంటున్నప్పటికీ తరగలేదు. అల్లాహ్ కృపవల్ల జమ్‌జమ్ జలనిధి లభించిందని ముస్లింల విశ్వాసం. ప్రపంచ ముస్లింలు జమ్‌జమ్ జలనిధిని పవిత్రమైనదిగానే కాక దివ్య ఔషధంగా భావిస్తారు. హజ్‌యాత్రలో భాగంగా సౌదీకి వెళ్లిన ప్రతి ముస్లిం ఈ నీటిని తమ దేశానికి తీసుకుని వెళ్లి అందరికీ పంచుతారు. జమ్‌జమ్ నీరు కూడా సౌదీ ప్రజల దాహాన్ని తీరుస్తుంది. ప్రపంచంలోని ఒక్క నది కూడా లేని దేశాలు ఇంకా అనేకం ఉన్నాయి. అందులో కోమొరోస్, డిజిబౌటి, లిబియా, మాల్టా, వాటికన్ సిటీ, కిరిబాటి, మొనాకో, మార్షల్ దీవులు, నౌరూ, టోంగా, టువాలు, బహ్రెయిన్, కువైట్, మాల్దీవులు, ఒమాన్, ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, యెమన్ కూడా ఇదే కోవలోకి వస్తాయి.






సౌదీ అరేబియా ఒక ఇస్లామిక్ దేశం. సౌదీలోని కొన్ని ప్రాంతాలలో ముస్లింమేతరులు నివసిస్తున్నారు. ఇతర మతాలకు చెందిన ఆలయాలు ఇక్కడ నిర్మించడం కానీ, పూజలు చేయడం నిషిద్ధం. ఇతర మతాల గ్రంథాలను ఇక్కడ పంచినా ఉరి తీస్తారు. ఎందుకంటే సౌదీ ఇస్లామిక్ చట్టాలు, మతపరమైన ఆచారాలను సంబంధించిన నిబంధనలకు కట్టుబడి ఉంది, సౌదీ అరేబియా బహిరంగంగా ఇస్లాం ఆచారాన్ని మాత్రమే అనుమతిస్తుంది. హిందూ మతంతో సహా ఇతర మతాల దేవాలయాలు వంటి ప్రార్థనా స్థలాలను నిర్మించడాన్ని ఇక్కడ అనుమతించరు. అందుకు దీన్ని దేవాలయాలు లేని దేశంగా చెబుతారు. ఇక్కడ అన్నీ మసీదులే ఉంటాయి. ముఖ్యంగా మక్కాలోని కాబా గృహం ఉన్న ప్రాంతంలో కేవలం ముస్లింలనే అనుమతిస్తారు. పొరపాటున ఈ ప్రదేశంలో అన్యమతస్థులు అడుగు పెడితే ఉరితీస్తారు. అక్కడ ఏముందో కూడా చూడకుండానే కొందరు వాట్సప్ యూనివర్సిటీ ప్రొఫెసర్ల మిడిమిడి జ్ఞానంతో పిచ్చిపిచ్చ పోస్టులు పెట్టి జ్ఞానులవలే పోజులు పెడుతూ తమ అజ్ఞానాన్ని ప్రదర్శిస్తుంటారు. వాటికన్ సిటీలో గుడి, మసీదు కనపడవు.



## జైలు లేదు

ఖైదీలు, జైళ్లు లేని ప్రదేశం ఆదర్శధామం. భూమిపై స్వర్గం అని చెప్పవచ్చు. వార్తా నివేదికల ప్రకారం నెదర్లాండ్ దేశంలో అనేక జైళ్లను మూసివేశారు. మిగిలిన కొన్ని జైళ్లల్లో కొంతకాలం పాటు నార్వే వంటి ఇతర దేశాల ఖైదీలతో నింపారు. నెదర్లాండ్స్‌లో ఖైదీలు, నేరస్తులు తగ్గిపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. నెదర్లాండ్స్‌లో జైళ్లు లేవంటే ఆశ్చర్యం కలగక మానదు. యూరప్‌లోని నెదర్లాండ్స్ కటకటాల వెనుక ఉంచడానికి ఎవరూ లేని దేశంగా ప్రసిద్ధి చెందింది. ఏ దేశంలోనైనా నేరాలు, హత్యలు, దోపిడీలు, మానభంగాలు చేసిన వారిని జైల్లో పెడతారు. 5 సంవత్సరాల క్రితం 2013లో నెదర్లాండ్స్‌లో 13మంది ఖైదీలు మాత్రమే ఉన్నారు. ఆ తరువాత 2018లో ఈ దేశంలో నేరస్థులు లేరు. ఒక దేశంలో ఖైదీలు లేకుండా జైళ్లు ఖాళీగా ఉన్నాయంటే నమ్మడం కష్టం. నేరాలు వేగంగా పెరుగుతున్న ప్రపంచంలో క్రైమ్ రేట్లను తగ్గించడం వల్ల ఈ యూరోపియన్ దేశం అయిన నెదర్లాండ్స్ క్రమేణా జైళ్లను మూసివేస్తూ వచ్చింది. నేరస్థులకు శిక్షలు విధించడం కంటే మెరుగైన జీవితాన్ని గడపడానికి వారికి పునరావాసం కల్పించడంలో నెదర్లాండ్స్ ఆసక్తి కనబరచింది. దాంతో ఖైదీల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఆ కారణంగా జైళ్ల

**(మిగతా 19వ పేజీలో)**

కథ

# నక్కకు గుణపాఠం

సుందరవనం అనే అడవిలో జిత్తులమారి నక్క ఉండేది. అది అన్నీ పిల్లజంతువులను భయపెట్టేది. అది సింహానికి సలహాదారు. కనుక జంతువులు అది ఏం చేసినా సహించేవి. ఆ అడవిలోనే ఉన్న కోతి సింహాన్ని ఎన్నోసార్లు ప్రమాదాల నుండి కాపాడింది. అందుకే సింహానికి అదంటే మిక్కిలి అభిమానం. ఈ సంగతి నక్కకు తెలియదు. ఇలా ఉండగా ఒకసారి నక్క ఒక కొండ గొర్రెపిల్ల కనిపిస్తే ‘ఓ కొండగొర్రె! అదిగో! ఒక తోడేలు ఇటే వేగంగా వస్తున్నది. అది నిన్ను తప్పక పట్టుకొని తింటుంది’ అని భయపెట్టింది. ఆ కొండ గొర్రెపిల్ల భయంతో పారిపోతుంటే నక్క పగలబడి నవ్వింది. ఆ కొండగొర్రె వెళ్లి తన తల్లికి ఆ సంగతి చెప్పింది.



మరికొన్ని రోజులకు ఆ నక్క ఒక కుందేలు పిల్లను ‘అదిగో! కుందేలు పిల్లా! చిరుతపులి ఒకటి ఇటే వస్తున్నది. నీకు ఈ రోజే ఆఖరి రోజు’ అని దానిని కూడా భయపెట్టింది. అది విన్న ఆ కుందేలు పిల్ల వెంటనే పారిపోతుంటే దాన్ని చూసిన నక్క బిగ్గరగా నవ్వసాగింది. ఆ కుందేలు పిల్ల కూడా ఈ విషయం తన తల్లికి చెప్పింది. అక్కడ చెట్టు చాటున ఉన్న ఎలుగుబంటి ఇది గమనించి నక్కతో అలా చేయడం తగదనీ, చిన్న వాటిని భయపెట్టడం మానుకోమని సలహా ఇచ్చింది. కానీ నక్క దాని మాటను పెడచెవిన పెట్టింది. జంతువులన్నీ కలిసి సింహానికి ప్రియమైన కోతి వద్దకు వెళ్లి నక్క తమ పిల్లలను భయపెడుతున్నదని చెప్పాయి. కోతి దానికి తగిన గుణపాఠం చెబుతానని వాటికి హామీ ఇచ్చింది. ఒకసారి నక్కకు సింహం అభిమానించే కోతి ఎదురైంది. అది కోతిని కూడా భయపెట్టాలనుకొని దానితో ‘ఓ కోతి బావా! మనకు ప్రళయం వస్తోంది. నీకు తెలుసా! చెట్లపైన తిరిగే ప్రాణులేవి బ్రతకవట. నీకు చాలా ముప్పు ఉంది. సింహం అంటుంటే విన్నాను’ అని అంది. అప్పుడు కోతి ‘ఆ ప్రళయం సంగతి తర్వాత! ముందు నీకు పెద్ద ప్రమాదం వస్తోంది. నా వెనుక పక్క అడవికి చెందిన ఒక పెద్ద పులి పరిగెత్తుతూ వస్తున్నది. నేను దాని నుండి తప్పించుకుని వస్తున్నాను. నాకు చెట్టెక్కడం వచ్చు. నీకేమో రాదు. దాని చేతిలో నీవు చావక తప్పదు’ అంటూ అది ‘అమ్మో పులి’ అంటూ చెట్టెక్కింది. వెంటనే నక్క వెనక్కి తిరిగి చూడకుండా భయంతో ఒకే పరుగు తీసి ఒక చెట్టు పొదలలో దాక్కుంది. అది ఎంత సేపు ఎదురు చూసినా పులి మాత్రం రాలేదు.

అప్పుడు నక్క బయటకు వచ్చి అక్కడ చెట్టుపైన ఉన్న కోతితో ‘పులి ఏది? నన్ను అనవసరంగా భయపెట్టావు’ అని అంది. అప్పుడు కోతి ‘పులి లేదు, గిలి లేదు. నీవు పిల్ల జంతువులను భయపెడుతున్నావని తెలిసింది. నీకు ఆ భయం ఎలా ఉంటుందో తెలియజేయాలని అలా చేశాను’ అని అంది.

అప్పుడు నక్క ‘నేను సింహానికి నీ సంగతి చెబుతాను’ అని అంది. అప్పుడే అక్కడకు వచ్చిన ఎలుగుబంటి ఇది విని ‘ఈ కోతి ఎవరనుకున్నావు. సింహానికి అత్యంత ప్రియమైంది. సింహం దాని మాటనే వింటుంది’ అని అంది. ఆ మాట విన్న నక్క భయపడి వెంటనే మరో అడవికి పరుగుతీసింది. దానికి గుణపాఠం చెప్పినందుకు ఎలుగుబంటితో పాటు మిగతా జంతువులు కోతిని అభినందించాయి.

– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య



వార్త ఆదివారం

## బాలగేయం

### పండుగ వేళ..



వచ్చే..వచ్చే..
దసరా పండుగ
సెలవులు రానున్నాయి
అందరం కలిసి
అమ్మమ్మ నాన్నమ్మల
ఊళ్లకు వెళ్తాం
అమ్మమ్మ చేసే
పిండివంటల్ని ఆరగిస్తాం
స్నేహితులతో పండుగ
ఉత్సవాల్లో కేరింతలాడతాం
గ్రామాల్లోని పంటపొలాల్లో
ఆటలాడతాం
స్వచ్ఛమైన పాడిగేదల
పాలను తాగుతాం
కమ్మని నెయ్యినే తింటాం
మీగడ పెరుగంటే
మాకెంతో ఇష్టం
రాత్రివేళలో నానమ్మ
కథల్ని వింటాం
తాతయ్యతో ఆడుకుంటాం
అందరితో ఆనందంగా
గడుపుతాం.

– సండే డెస్క్

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**– ఎస్.వేదవతి,** విజయవాడ

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. మనం పీల్చేదంతా ఆక్సిజనేనా?**

**జవాబు: వేదవతి!** మనం పీలుస్తున్న గాలిలో కేవలం ఆక్సిజన్ 20 శాతం మాత్రమే ఉంటుంది. మిగిలిన 80 శాతంలో 60 శాతం నైట్రోజన్(నత్రజని), 20 శాతం కార్బన్ డై ఆక్సైడ్ లాంటి ఇతర వాయువులు కూడా ఉంటాయి. వాస్తవానికి గాలిలో పూర్తిగా ఆక్సిజన్ ఉండదు. ఆ విధంగా వుంటే మొత్తం జీవకోటికి ప్రమాదకరంగా పరిణమిస్తుంది.

**– కె.ఫణికుమార్,** సూర్యాపేట

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే.'మానసిక స్వేచ్ఛ' అంటే అర్థం ఏమిటి?**

**జవాబు: ఫణికుమార్!** మనిషి స్వేచ్ఛగా జీవిస్తాడా? దీనికి ముందు మనసు స్వేచ్ఛగా ఉండాలి. స్వేచ్ఛగా ఆలోచించాలి. ఆలోచన అనేది ఏదైనా దానిని గమనించాలి. ఒప్పు, తప్పు అనే భావాలకు ఏ ఆలోచనా రాదు. కనుక ఆలోచనలనేవి ఎందుకు వస్తున్నాయో గమనించాలి. వాటి తీరుతెన్నులు, గమనాన్ని అవగాహన చేసుకోవాలి. ఈ సందర్భంలోనే మానసిక స్వేచ్ఛలోని ఔన్నత్యం అర్థమవుతుంది. ఈ స్వేచ్ఛను అనుభవించలేనివారు జీవితాన్ని సంపూర్ణంగా ఆస్వాదించలేరు. మనసును నియంత్రించే నమూనాలకు, చట్రాలకు, మూసలకూ అతీతంగా వ్యవహరించే చైతన్యం మాత్రమే మానసిక స్వేచ్ఛకు దోహదకారికాగలదు. మానసికస్వేచ్ఛతో ఆలోచించగలిగే వారిలోనే సృజనాత్మక అనేది కొద్దో గొప్పో ఉండగలదు. వీరే జీవితాన్ని, సమాజాన్ని సవ్యమైన రీతిలో, సకాలంలో ఆకళింపు చేసుకుంటారు. మానసిక స్వేచ్ఛకు ప్రాతిపదికగా మనసు పోకడలను మనం ఎప్పటికప్పుడు సునిశితంగా గమనించ గలగడమే ఇందుకు సరైన మార్గం. మనసు మన స్వాధీనంలో ఉంటే (మనసును గెలవండి, మనసు మీద విజయం సాధించండి.. అనే తరహా పుస్తకాలను ఏమాత్రం చదవకండి. మన మనసును మనం అణగదొక్కి జయించడమేమిటి?





## బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవాలు

**(11వ పేజీ తరువాయి)**

**చంద్రప్రభవాహనం:** ఏడవరోజురాత్రి మలయప్పస్వామి చల్లనిదేవుడు చంద్రప్రభవాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షిస్తారు. చంద్రుడు ఓషదీశుడు, భగవంతుడు చంద్రుని రూపంలో ఓషధులను పోషిస్తున్నాడనే అర్థంలో చంద్రప్రభవాహనం వుంటుంది. చంద్రోదయం కాగానే కలువలు వికసిస్తాయి. సాగరుడు ఉప్పొంగుతాడు.

**చక్రస్నానం:** తొమ్మిదిరోజులు ఉదయం,రాత్రి జరిగే వాహన సేవల్లో స్వామివారు భక్తులను కటాక్షించి మీ రక్షణకు నేనున్నానంటూ అభయమిస్తారు. అందుకే చివరగా భక్తుల పాపాలు తొలగిపోవడానికి వేలతీర్థాలు కలిసే పవిత్రమైన శ్రీవారి పుష్కరిణిలో శ్రీసుదర్శనచక్రత్తాళ్వారులకు చక్రస్నాన మహోత్సవం జరిపిస్తారు.

తొమ్మిదిరోజులు ఉదయం,రాత్రి జరిగే వాహనసేవల్లో స్వామివారు భక్తులను కటాక్షించి మీ రక్షణకు నేనున్నానంటూ అభయమిస్తారు. అందుకే చివరగా భక్తుల పాపాలు తొలగిపోవడానికి వేలతీర్థాలు కలిసే పవిత్రమైన శ్రీవారి పుష్కరిణిలో శ్రీసుదర్శనచక్రత్తాళ్వారులకు చక్రస్నాన మహోత్సవం జరిపిస్తారు. ఆలయానికి పక్కనే వున్న ఈ పుష్కరిణిలో బ్రహ్మోత్సవాలు చివరిరోజు తెల్లవారుజామున శ్రీదేవిభూదేవులతో మలయప్పస్వామివారు పల్లకిపై, శ్రీసుదర్శనచక్రత్తాళ్వారు మరోపల్లకిపై పుష్కరిణి వద్దకు చేరుకుంటారు. అక్కడ అర్చకులు, జియ్యంగార్లు వేదపఠనం, శ్రీసూక్తంతో ఉత్సవమూర్తులకు పసుపు, చందనం, కొబ్బరిజలం, పాలు, పెరుగు, తేనె సుగంధద్రవ్యాలతో విశేష అభిషేకాదులు నిర్వహిస్తారు. తరువాత శ్రీసుదర్శన చక్రత్తాళ్వారును శ్రీవారి పుష్కరిణిలో మూడుసార్లు ముంచి పవిత్రస్నానం చేయిస్తారు. ఇదే సమయంలో భక్తులు పుణ్యస్నానాలాచరిస్తారు. చివరగా తొమ్మిదవరోజురాత్రి ధ్వజపటాన్ని అవరోహణం చేయడాన్ని ధ్వజావరోహణం కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ ఘట్టంతో తొమ్మిదిరోజుల బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి.

## భక్తులకు పటిష్టమైన ఏర్పాట్లు

**టిటిడి ఇఒ శ్యామలరావు**



కలియుగవైకుంఠవాసుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు విచ్చేయనున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేశాం. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ వారికి కేటాయించిన విధులను చిత్తశుద్ధితో మానవసేవే మాధవసేగా భావించి పనిచేస్తారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు మాఢవీధుల్లోని గ్యాలరీల్లో సౌకర్యాలు కల్పించాం. అశేషంగా భక్తులు తరలివస్తారనే ముందుచూపుతో అన్ని విధాలా అవసరమైన ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పిస్తున్నాం. అన్ని రకాల దర్శనాలను రద్దుచేసి, సామాన్యభక్తులకు సర్వదర్శనం కల్పిస్తున్నాం. పెరటాసి మాసం కూడా రావడంతో బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిదిరోజులు భక్తులు సంయమనంతో వాహనసేవలు వీక్షించడంతోబాటు మూలవిరాట్టును కూడా ప్రశాంతంగా దర్శనం చేసుకోవాలని ఇఒ శ్యామలరావు కోరారు. తిరుమలలో అన్నప్రసాదాలు నాణ్యత పెంచాం. భక్తులు సంతృప్తి చెందుతున్నారు.

## సకల సౌకర్యాలు...

**టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి**



తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామికి అక్టోబర్ 4వతేదీ నుండి మొదలుకానున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో విచ్చేసే ప్రతి భక్తునికి సకల సౌకర్యాలు కల్పిస్తామని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. సామాన్య భక్తుల దర్శనాలకే అధిక ప్రాధాన్యత నిస్తున్నాం. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిది రోజులు విఐపి బ్రేక్, అన్ని ప్రత్యేక దర్శనాలు, ఆర్జిత సేవలు కూడా రద్దుచేశాం. 5లక్షల లడ్డూలు బఫర్‌స్టాక్ చేశాం. భక్తులను ఆకట్టుకునేలా శ్రీవారి ఆలయం, తిరుమలలోని పలు ముఖ్య కూడళ్లను సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నాం. బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ప్రశాంతంగా వాహనసేవలు వీక్షించేలా చూస్తాం.

## భద్రతపరంగా అదనపు సిసి కెమెరాలు!

**టిటిడి సివిఎస్ఒ శ్రీధర్**



తిరుమలలో నాలుగురోజుల్లో మొదలవుతున్న శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు విచ్చేస్తున్న భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని భద్రత పరంగా అన్ని చర్యలు తీసుకుం టాం. అధునా తన టెక్నాలజీ కెమెరాలను అదనం గా ఏర్పాటుచేసి నిరంతరం పర్య వేక్షిస్తూ భక్తుల రక్షణకు ప్రాధాన్యత నిస్తాం. ఆలయ మాడవీధుల్లో సామాన్య భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు సాఫీగా ఏర్పాటుచేసి, సూచికబోర్డులు ఏర్పాటు చేశాం. గ్యాలరీల్లో నిరంతరాయంగా భక్తులకు సేవలందించే సిబ్బంది, శ్రీవారి సేవకులు, భద్రత సిబ్బంది సమన్వయంతో సేవలందించేలా చూస్తాం. విజయవంతంగా ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం.

## ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు

**తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు**



బ్రహ్మోత్సవాల్లో వాహనసేవలు వీక్షణకు విచ్చేసే భక్తులు తీసుకు వచ్చే వాహనాలతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటాం. పార్కింగ్ ప్రదేశాలు సూచిస్తూ సూచిక బోర్డులు, సిసికెమె రాలు, ఫ్లడ్ లైట్లు ఏర్పా టు చేశాం. క్యూలైన్లు, గ్యాలరీ లు, ప్రవేశనిష్క్రమణ పాయింట్లు, ఆలయ మాఢవీధుల ప్రాంతాల్లో అనుభవజ్ఞులైన అధికారులను, సిబ్బందిని నియమించి మెరుగైన సేవలందిస్తాం. తిరుపతి,తిరుమలతోబాటు ఘాట్‌రోడ్లపై ట్రాఫిక్ నియంత్రణ, క్రమబద్ధీకరణ చాలా ముఖ్యంగా భావించి అన్ని ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. క్రైమ్‌పార్టీ, సైబర్‌క్రైమ్ పోలీసులతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం.

**– పావులూరు పద్మనాభమ్/తిరుమల**

**– ఫొటోలు: టి.శ్రీనివాసులు**

## కొన్ని దేశాల ప్రత్యేకతలు

(15వ పేజీ తరువాయి)



చాలావేగంగా ఖాళీ అవుతున్నాయి. నెదర్లాండ్స్‌లో ఖైదీలు తగ్గడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఖైదీల ప్రతి కార్యాచరణను రికార్డ్ చేసేలా వారి చీలమండకు ఒక పరికరాన్ని కట్టి అమరుస్తారు. చాలామంది నేరస్థులకు ఇటువంటి పరికరాన్ని అమర్చి వారి దైనందిన జీవితాన్నిరికార్డు చేసి పరిశీలించారు. నేరస్తులను సంస్కరించాలనే సదుద్దేశంతో నెదర్లాండ్స్ పోలీసు అధికారులు ఈ పరికరాన్ని వారికి అమర్చారు. ఈ ఎలక్ట్రానిక్ ట్యాగింగ్‌ను ఉపయోగించి నేరస్తులను నియంత్రించడంలో నెదర్లాండ్ పోలీసు వ్యవస్థ సఫలీకృతమయ్యారు. ఖైదీల కోసం గ్రంథాలయాలు ఏర్పాటు చేసి వారు గ్రంథ పఠనం చేసేలా చేయడం, ఉదయాన్నే శారీరక వ్యాయామం చేయించడం, ఖైదీలు మానసిక సమస్యల నుండి బయటపడేలా చేయడం, క్రీడా కేంద్రాలను ఏర్పాటు చేసి వారు పలు క్రీడలు ఆడేలా చేయడం, డ్రగ్స్ సేవించే వ్యసనం కలవారిని దాని బారి నుంచి బయటపడేలా పునరావాస కేంద్రాల ఏర్పాటు ఇత్యాది కార్యక్రమాలు నిర్వహించారు.

### లిఖిత రాజ్యాంగం లేని దేశాలు

ప్రపంచంలో కొన్ని దేశాలలో లిఖిత రాజ్యాంగం ఉంటే మరి కొన్ని దేశాలలో అలిఖిత రాజ్యాంగం అమలులో ఉంది. కొన్ని దేశాలు రాజ్యాంగంతో పని లేకుండా రాజరిక వ్యవస్థను కొనసాగిస్తున్నాయి. ఒకదేశం పరిపాలనా నిర్వహణకు పాటించాల్సిన నియమనిబంధనల సంపుటిని రాజ్యాంగం అంటారు. ప్రభుత్వ అధికారాలేమిటి? పౌరుల హక్కులెలా ఉంటాయి? దేశం సాధించాల్సిన లక్ష్యాలు ఇవన్నీ రాజ్యాంగంలో ఉంటాయి. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఒమన్, బ్రూనై, వాటికన్ సిటీ, ఇత్యాది అనేక దేశాలకు రాజ్యాంగాలు లేవు. రాజరిక వ్యవస్థ ఉంది. అక్కడ రాజు చెప్పిందే శాసనం. ప్రపంచంలో అతిపెద్ద లిఖిత రాజ్యాంగం భారత రాజ్యాంగమే. దీనిలో 444 అధికరణాలు, 22 భాగాలు, 12 షెడ్యూళ్లు ఉన్నాయి. ఇందులో మొత్తం పదాలు 3,800 మాత్రమే. బ్రిటన్ దేశంలో అలిఖిత రాజ్యాంగం ఉంది. అంటే లిఖిత రూపంలో అక్కడ రాజ్యాంగం లేదు. అయితే రాజ్యాంగబద్ధ పాలనే అక్కడ జరుగుతుంది. ఇలాంటి రాజ్యాంగాన్ని అలిఖిత రాజ్యాంగం అంటారు. బ్రిటన్‌తోపాటు న్యూజిలాండ్, కెనడా, ఇజ్రాయేల్ ఇత్యాది దేశాలలో లిఖిత రాజ్యాంగం లేదు. న్యూజిలాండ్ దేశంలో పౌరులంటే ఏమిటి? దేశం అంటే ఏమిటి? అని నిర్వచించడానికి కొన్ని నిబంధనలు ఉన్నాయి. వీటి ఆధారంగానే అక్కడ పరిపాలన జరుగుతుంది. ఇజ్రాయిల్‌లో లిఖిత రాజ్యాంగం లేకపోయినా 1950 జూన్ 30న ఆమోదించిన హరారీ ప్రకటన ప్రకారం అక్కడ పరిపాలన సాగుతోంది. లిఖిత రాజ్యాంగాలు లేని దేశాలు తమ ఆనవాయితీల ఆధారంగా నడుస్తాయి.

## ప్రకృతియే మన ఆయువు

(4వ పేజీ తరువాయి)

### తెలంగాణలో

తెలంగాణలో 9యేళ్లుగా హరితహారంలో కోట్ల మొక్కలు నాటిన చల్లదనం రావటం లేదు దానికి కారణం వాయుకాలుష్యం పెరగడమే. భూమిపై ఉన్న అనేక రకాల జంతు వులు ప్రాణులు అంతరిస్తున్నాయి. పక్షులు తేనెటీగలు పిచ్చుకలు తగ్గిపోవడం వల్ల ఆహార పంటల దిగుబడి తగ్గి కొరత ఏర్పడుతుంది. ఎరువులు పురుగుమందుల వినియోగం పెరగడం వల్ల భూమి సారవంతాన్ని కోల్పోయి భూమి నాశనమవుతోంది. సముద్ర జీవులను బతకనివ్వడం లేదు. 2 సంవత్సరం 2024 థీమ్ ప్రకృతో సామరస్యపూర్వకంగా జీవించడం అనే థీమ్ ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ఈ థీమ్‌లో స్థిరమైన జీవన విధానాలను ప్రోత్సహించడం ప్రపంచంలో సామరస్య పూర్వక సంబంధాల బలోపేతంపై దృష్టిపెట్టే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తారు. మానవజాతి జీవించడానికి ఉన్నది ఒకటే భూమి దీనిపై ప్రత్యామ్నాయం లేదు. భూమి నాశనమైతే మానవ మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది.



### పర్యావరణ రక్షణ పౌరసమాజం పాత్ర

➤ చైతన్యవంతమైన పౌరసమాజం ప్రకృతి పర్యావరణ పరిరక్షణ కొరకు ఉద్యమించాలి. – ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి. ప్లాస్టిక్ బ్యాగులస్థానంలో జనుపనార సంచులు వాడేట్లు ప్రజలకు అవగాహన కలిగించాలి.

➤ వాయు కాలుష్యం తగ్గించడానికి వాహనాల వినియోగం తగ్గించాలి.

➤ వ్యవసాయరంగంలో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలి. సేంద్రీయ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి.

➤ ప్రతిగామంలో చెక్‌డ్యామ్‌లు నిర్మించాలి. 'గోబర్‌గ్యాస్ ప్లాంట్ల'ను ఏర్పాటు చేయాలి.

➤ అడవుల పెంపకం పెద్ద ఎత్తున చేపట్టాలి. ప్రకృతి పర్యావరణహి తమైన చర్యలు చేపట్టాలి. ప్రజల భాగస్వామ్యంతో ఎక్కువ మొక్కలు నాటాలి. వాటికి సంరక్షణ చర్యలు చేపట్టాలి. పెద్దఎత్తున చెట్ల నరికివేత అరికట్టాలి.

➤ జల కాలుష్యాన్ని నివారించాలి. నీటిని పొదుపుగా వాడుకోవాలి. భూగర్భ జలాలను సంరక్షించుకోవాలి.

➤ పాఠశాల, కళాశాల స్థాయిలో ప్రకృతి పర్యావరణ పరిరక్షణ పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలి. యూనివర్సిటీ స్థాయిలో ప్రకృతి పర్యావరణం పట్ల పరిశోధన కొరకు నిధులు కేటాయించాలి.

➤ ఇంటినుంచే ప్రకృతి పరిరక్షణ ఉద్యమం ప్రారంభం కావాలి. స్వచ్ఛంద సంస్థలు, మహిళాసంఘాలు, యువజన సంఘాలు, సామాజిక సాంస్కృతిక సంఘాలు సమిష్టిగా ప్రకృతి పరిరక్షణ ఉద్యమంలో బహుముఖ పాత్ర పోషించాలి. 'ప్రకృతి రక్షణే మానవాళి రక్షణ' అన్నది ఒక నినాదం కాకుండా జీవనవిధానం కావాలి.

కథ

# ఎంతెంత దూరం

ఈదర శ్రీనివాసరెడ్డి

"కాఫీ... కాఫీ అంటూ నా మానాన నేను అరుస్తూనే ఉన్నాను. మీరేమో ఏమీ పట్టనట్లు పొద్దున్నే ఆ పేపర్ ముందు వేసుకుని కూర్చుంటారు" భర్త మీద చిరుకోపం ప్రదర్శిస్తూ కాఫీకప్పును అందించింది వరలక్ష్మి.

ఇంటి ముందున్న లాన్‌లో కూర్చుని స్వచ్ఛమైన ఉదయపు గాలులు పీలుస్తూ ప్రశాంతంగా న్యూస్ పేపర్ తిరగేస్తున్న వెంకట్రావు భార్య మాట వినపడగానే చదువుతున్న పేపర్ పక్కన పెట్టి, భార్య అందించిన కాఫీకప్పును అందుకుంటూ "వినపడలేదు, వినపడితే లేచి రాకుండా ఉంటానా? అంత కోపం ఎందుకు?" అన్నాడు భార్య బుజ్జగిస్తూ.

ఉదయాన్నే పచ్చని చెట్ల మధ్య కూర్చుని వాటినుండి వెలువడే స్వచ్ఛమైన గాలి పీలుస్తూ భార్య చేసిచ్చిన వేడి వేడి ఫిల్టర్ కాఫీ తాగుతూ, న్యూస్ పేపర్ తిరగేస్తూ ఉంటే ఆ ఆనందమే వేరు. అది అనుభవించే వాళ్లకు మాత్రమే తెలుస్తుంది.

వెంకట్రావు ఆ విషయంలో అదృష్టవంతులు అని చెప్పాలి. రిటైర్ అయిన దగ్గర నుండి వెంకట్రావు తన ఇంటి చుట్టూ మొక్కలు పెంచడాన్ని వ్యాపకంగా పెట్టుకున్నాడు.

ఇల్లు చిన్నదైనా ఇంటి ముందు లాన్ ఇంటి చుట్టూ మొక్కలు, ఇంటి మీద సన్నజాజి పందిరి పెంచటంలో వెంకట్రావు ఇల్లు చూడముచ్చటగా ఉంటుంది పొదరిల్లులా.

తను పెంచిన మొక్కల్ని చంటిబిడ్డలా చూసుకుంటాడు వెంకట్రావు. రోజూ ఉదయాన్నే వాటితో ఓ గంట పాటు గడిపి వాటి యోగక్షేమాలు చూసిన తర్వాత ఏ పనైనా మొదలు పెడతాడు.

"త్వరగా తాగండి, మరీ చిన్న పిల్లాడిలా తాగుతున్నారు. అవతల నాకు వంట గదిలో పని ఉంది" అంటూ నింపాదిగా కాఫీ తాగుతున్నా కసురుకుంది వరలక్ష్మి.

"రాత్రి నువ్వు నిద్ర పోయిన తర్వాత అబ్బాయి ఫోన్ చేశాడు" కాఫీ తాగటం పూర్తవడంతో కాఫీకప్పు భార్యకు అందిస్తూ చెప్పాడు వెంకట్రావు.

కొడుకు మాట రావడంతో అప్పటిదాకా చిటపటలాడిన వరలక్ష్మి ముఖంలో ఒక్కసారిగా ఆనందం వెల్లివిరిసింది. ఎంతైనా కన్న ప్రేమ కదా!

భర్త పక్కనే కూర్చుంటూ "ఏమంటున్నాడు?

కోడలు కూడా మాట్లాడిందా?

మనవళ్లు ఏం చేస్తున్నారట?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది.

"వంట గదిలో ఏదో పని ఉంది అన్నావుగా.. వెళ్లి పని పూర్తి చేసుకుని రా" భార్యను ఉడికించాడు వెంకట్రావు.

"అబ్బా.. ఏడిపించకుండా ముందు అబ్బాయి సంగతులు చెప్పండి" ఉత్సాహం ఆపుకోలేక అడిగింది వరలక్ష్మి.

"అక్కడి వాతావరణం చూస్తుంటే భయమేస్తోందట. హైస్కూలు పిల్లలు కూడా విచ్చలవిడిగా డ్రగ్స్ వాడుతున్నారట. కనుక పిల్లల్ని అక్కడే చదివిస్తే పిల్లలు చెడిపోవడానికి ఎక్కువ అవకాశం ఉందట. అందుకని...."

వెంకట్రావు చెప్పటం పూర్తి చేసే లోపే "అందుకని? ఏం చేయబోతున్నారు. పిల్లల్ని మన దగ్గర పంపిస్తారా?" అంటూ అడ్డు పడింది వరలక్ష్మి.

"అంత కంగారెందుకు? నన్ను పూర్తిగా చెప్పనివ్వు. అబ్బాయి, కోడలు, పిల్లలు అందరూ అమెరికా వదిలి కుటుంబంతో సహా ఇక్కడకు వచ్చేస్తారట" పూర్తి చేశాడు వెంకట్రావు.


"మరి అబ్బాయి ఉద్యోగం?" మరో సందేహం లేవనెత్తింది వరలక్ష్మి.

"అబ్బాయి పని చేసేది సాఫ్ట్వేర్ కంపెనీలో కదా? వాళ్ల కంపెనీ బ్రాంచ్ ఇక్కడ కూడా ఉందట.

ఇక్కడికి ట్రాన్స్ఫర్ చేయమని రెండు నెలల ముందే అడిగితే వాళ్లు సరే అన్నారట"

ఉద్యోగానికి ఏమి డోకా లేదు.. అన్నట్లు వివరంగా చెప్పాడు వెంకట్రావు.

"పోనీలెండి ఇకనన్నా అందరం కలిసి సంతోషంగా ఉండొచ్చు. భగవంతుడు ఇన్నాళ్లకు నా ప్రార్థన ఆలకించాడు" అన్నది గుండెనిండా సంతోషం వరలక్ష్మి.



"నువ్వే కదా? నేను వద్దంటున్నా, నా ఒక్కగానొక్క కొడుకుని అమెరికా పంపమని ఆ దేవుణ్ణి కోరుకుంది. వాడికి వీసా రాకపోతే నా చేత బలవంతంగా చిలుకూరి బాలాజీ గుడిలో ప్రదక్షిణలు చేయించావు. ఇప్పుడేమో మళ్లీ అదే దేవుణ్ణి నీ కొడుకుని అమెరికా నుండి వెనక్కు పంపమని వేడుకుంటున్నావు. నీ కోరికలు తీర్చలేక ఆ దేవుడు తికమకపడి ఈ గుడి వదిలి పారిపోతాడేమో చూడు" అంటూ గతంలో కొడుకును అమెరికా పంపడానికి వరలక్ష్మి ఎన్ని పూజలు వ్రతాలు చేసిందో గుర్తు చేశాడు వెంకట్రావు.

"అబ్బాయిని అమెరికా పంపటం మీకు ఇష్టం లేకపోతే ఆ రోజే మీరు కచ్చితంగా వద్దు అని చెప్పాల్సింది.

ఆ రోజు మీరు ప్రతిదానికి తల ఊపి, ఇప్పుడు నాది తప్పని అనటం ఏమి న్యాయం చెప్పండి" కొడుకు అమెరికా వెళ్లే విషయంలో ఇద్దరి ప్రమేయం ఉందని గుర్తు చేసింది వరలక్ష్మి.

"అవును, ఆ రోజు తల ఊపిన మాట వాస్తవమే. అమ్మా, కొడుకు ఇద్దరూ కలిసి నేనేదో వాడి భవిష్యత్తును నాశనం చేస్తున్నట్లు నన్ను దోషిని చేసి మాట్లాడితే వేరే దారి లేక సరేనన్నాను. కానీ నాకు మాత్రం వాడు అమెరికా వెళ్లడం ఏమాత్రం ఇష్టంలేదు" అంటూ తన అంతరంగంలో ఉన్న అసలు విషయం చెప్పాడు వెంకట్రావు.

"సరేలెండి, ఇప్పుడవన్నీ ఎందుకు? అయిందేదో అయిపోయింది.. మనం మనవళ్లతో కలిసి ఆనందంగా గడపవచ్చు" గతాన్ని గుర్తు చేసుకుని బాధపడటం ఎందుకు అన్నట్లు భర్తతో రాజీ పడిపోయింది వరలక్ష్మి.

.............

ఓ నాలుగు రోజులు గడిచాక ఉదయాన్నే వెంకట్రావు బయటకు వెళ్లటానికి బయలుదేరుతుండగా "ఎక్కడికండీ ఇంత పొద్దున్నే బయల్దేరారు?" అంటూ కాఫీకప్పుతో ఎదురు చూసింది వరలక్ష్మి.

"చెప్పాలా? వద్దా? అని ఓ క్షణం సంశయించి ఎప్పుడో చెప్పే బదులు ఇప్పుడే చెబితే మంచిదని నిర్ణయించుకున్నవాడిలా "అబ్బాయికి వాళ్ల ఆఫీసు దగ్గర ఇల్లు వెతకడానికి వెళ్తున్నాను. బ్రోకర్‌కి చెబితే ఈరోజు రమ్మన్నాడు. ఎండ పడకముందే వెళ్లివద్దామని బయల్దేరాను" అని పొద్దున్నే తను బయటికి వెళ్లే విషయం భార్యకు చెప్పాడు వెంకట్రావు.

"అదేమిటండీ, అబ్బాయి ఇల్లు వెతకటం ఏమిటి? వాడికి అంత కర్మ ఏం వచ్చింది? ఈ ఇల్లు వాడిది కాదా? వాడు ఇండియాకి వస్తున్నాడంటే ఎంతో సంబరపడిపోయాను. ఒక ఇంట్లో అందరం కలిసి హాయిగా గడపవచ్చు అని. కానీ ఇప్పుడు ఇదేమిటి? ఒకే ఊళ్లో ఉంటూ వేరుగా కాపురం పెడితే చూసేవాళ్లు ఏమనుకుంటారు? ఇప్పుడు వాడికి వేరు కాపురం పెట్టాల్సిన అవసరం ఏమొచ్చింది?" అంటూ వరలక్ష్మి కళ్లనీళ్ల పర్యంతం అయ్యింది.

వరలక్ష్మిని చూస్తే వెంకట్రావుకు జాలేసింది "మన ఇల్లు చిన్నది. మనిద్దరికి అంతంత మాత్రంగా సరిపోతుంది. అందరం కలిసి ఈ చిన్న ఇంట్లో సర్దుకోవడం కష్టమే" అని అంటూ ఉండగానే– వరలక్ష్మి మధ్యలో అడ్డుపడి "అందుకని కొంపతీసి మీరుగానీ వాణ్ణి వేరుగా ఉండమని అన్నారా ఏమిటి?" అంటూ ప్రశ్నించింది.

"నేనెందుకు వారిని వేరుగా ఉండమని అంటాను. వాళ్ల అభిరుచులకు తగ్గట్టు మన ఇల్లు ఉండదు కదా? అదీకాక వాడి ఆఫీసుకు మన ఇల్లు చాలా దూరం. అందుకని వాడికి ఆఫీసుకు దగ్గరగా, వాళ్ల అభిరుచికి తగ్గట్టు బ్రోకర్‌ని ఇల్లు వెతకమని అన్నాను" భార్యకు నచ్చచెప్పే ప్రయత్నం చేశాడు. వెంకట్రావు.

"ఎంత చిన్నదైనా, ఎంత పాతదైనా ఇది వాడి సొంత ఇల్లండి. అంతగా చాలకపోతే మేడ మీద ఒక పోర్షన్ వేసి మనం పైకి వెళ్లి ఉందాం. ఇక దూరం అంటారా? ఎంతమంది రోజూ మైళ్లకు మైళ్లు ప్రయాణించి ఆఫీసులకు వెళ్లటం లేదు? పైపెచ్చు వాడికి కారు కూడా ఉంది" అంటూ భర్త చెప్పే కారణాలు సహేతుకంగా లేవని తేల్చేసింది వరలక్ష్మి.

"నువ్వు చెప్పేవన్నీ నిజమే అయినా నా వాళ్లు కోరుకున్న విధంగా మన ఇల్లు, మనం ఉండం కదా? వాళ్లకు నచ్చిన చోట వాళ్లని ఉండనివ్వు. వాళ్లను చూడాలనుకున్నప్పుడు ఎంతలోకి వెళ్లివస్తాం?" కొడుకు వేరుగా ఉండాలని నిశ్చయించుకున్నాడు" అని చెప్పకనే చెప్పాడు వెంకట్రావు.

> **"అబ్బాయిని అమెరికా పంపటం మీకు ఇష్టం లేకపోతే ఆ రోజే మీరు కచ్చితంగా వద్దు అని చెప్పాల్సింది. ఆ రోజు మీరు ప్రతిదానికి తల ఊపి, ఇప్పుడు నాది తప్పని అనటం ఏమి న్యాయం చెప్పండి" కొడుకు అమెరికా వెళ్లే విషయంలో ఇద్దరి ప్రమేయం ఉందని గుర్తు చేసింది వరలక్ష్మి.**

"మీరు చెప్పే కారణాలు చూస్తుంటే అవన్నీ నిజం కావని నా మనసుకి అనిపిస్తోంది. వేరే ఏదో బలమైన కారణం ఉండే ఉంటుంది. నేనే వాడికి ఫోన్ చేసి అసలు విషయం కనుక్కుంటాను" అంటూ కొడుక్కి ఫోన్ చేయటానికి సెల్‌ఫోన్ చేతిలోకి తీసుకుంది. ఫోన్ చేయబోతున్న భార్యను వారించి "మనతో ఉండటం వాడి భార్యకు ఇష్టం లేదట" అసలు విషయం చెప్పాడు వెంకట్రావు.

ఆ మాటలు విన్న వరలక్ష్మి సోఫాలో కూలబడి "ఎందుకు ఇష్టం లేదండీ? మనం ఏం తప్పు చేసాం?" అడిగింది జాలిగా వెంకట్రావు వంక చూస్తూ.

"కొన్ని ప్రశ్నలకు సమాధానాలు ఉండవు. మా అమ్మా నాన్నాలు ఏం తప్పు చేశారని ఆరోజు నువ్వు నా చేత వేరు కాపురం పెట్టించావు? ఈ రోజు నీ కోడలు చేత వేరు కాపురం పెట్టిస్తోంది. తరాలు మారినా మనుషులు మాత్రం మారలేదు" అంటూ వరలక్ష్మికి గతాన్ని గుర్తు చేశాడు.

భర్త మాటలకు వరలక్ష్మి ఒక్కసారిగా గతంలో తాను చేసిన తప్పేమిటో గుర్తుకొచ్చింది. అప్పట్లో ఎంత మూర్ఖంగా ప్రవర్తించాను అని ఆలోచిస్తూ గతం తాలూకు జ్ఞాపకాల సుడిలోకి జారుకుంది.

.............

వెంకట్రావుది సిటీకి దగ్గర్లో ఉన్న ఓ పల్లెటూరు. పేరుకు పల్లెటూరే అయినా సిటీకి దగ్గరగా ఉండటంతో స్వచ్ఛమైన పల్లెటూరి గాలులను సిటీ తాలుకు కాలుష్యపు వాయువులు మింగేశాయి. కేవలం గాలినే కాదు ప్రజల మనసులను కూడా కలుషితం చేసింది సిటీ వాతావరణం.

సిటీకి దగ్గరగా ఉండటంతో రియల్ ఎస్టేట్ రాబందులు పచ్చని పల్లెపై వాలిపోయి పొలాలన్నీ ప్లాట్లుగా మార్చివేశారు.

ఒకప్పుడు పల్లె చుట్టూ పచ్చని పొలాలు, కంటికి కనువిందు చేస్తూ ఉండేవి. ఇప్పుడు ఎటు చూసినా ఎర్రటి భూములే కనపడుతున్నాయి ఎరుపెక్కిన ఎడారిలా.

వెంకట్రావు తండ్రికి రెండు ఎకరాల పచ్చటి నేల ఉంది. రియల్ ఎస్టేట్ దళారుల ప్రలోభాలకు ఏమాత్రం లొంగిపోకుండా ఆ రెండు ఎకరాల్లోనే వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని గుట్టుగా సాగిస్తున్నాడు. వెంకట్రావు కూడా అదే ఊళ్లో జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగం రావడంతో ఉద్యోగం చేసుకుంటూ తండ్రికి వ్యవసాయంలో తోడుగా నిలబడడంతో ఏ కష్టాలు లేకుండా వాళ్ల జీవన నౌక సాగిపోయింది.

వెంకట్రావు వరలక్ష్మితో పెళ్లి అయిన నాటి నుండి మొదలయ్యాయి కష్టాలు. వరలక్ష్మి కాస్తంత కలిగిన కుటుంబం నుండి రావడం, పైపెచ్చు మొదటి నుండి సిటీ వాతావరణంలో పెరగడంతో పెళ్లయిన తర్వాత అత్తగారింట్లోని పల్లెటూరి వాతావరణంలో కలవలేకపోయింది.

“చుట్టుపక్కలవాళ్లు పొలాలను మంచి రేటుకు అమ్ముకుని ఆ డబ్బుతో సిటీలో మంచి బిల్డింగ్ కట్టుకుని మిగిలిన డబ్బు బిజినెస్ చేసి కోట్లు సంపాదిస్తున్నారు అని” రోజూ మొగుడ్ని సతాయించేది వరలక్ష్మి.

“వాళ్ల కంటే ఉద్యోగం సద్యోగం లేదు కాబట్టి పొలాలు అమ్ముకుని సిటీకి పోతున్నారు. మనకేం ఖర్మ. మనకు ఆ భగవంతుడు మంచి ఉద్యోగం ఇచ్చాడు. వెంకట్రావు భార్యకు ఎంత నచ్చచెప్పాలని చూసినా వినేది కాదు వరలక్ష్మి.



పైపెచ్చు “మీకు బతకడం తెలీదు పల్లెటూరి గబ్బిలాయిలు” అని ఈసడించింది.

తన తల్లిదండ్రులు బతికున్నంత కాలం పొలం అమ్మే ప్రసక్తే లేదని వెంకట్రావు భార్యకు తెగేసి చెప్పాడు. ఇటు పొలం అమ్మేటట్లు లేరని, వెంకటరమణ సిటీకి ట్రాన్స్ఫర్ చేయించుకోమని మళ్లీ ఒత్తిడి చేయటం మొదలు పెట్టింది.

దానికి కూడా వెంకట్రావు ససేమిరా అనడంతో వరలక్ష్మి అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది.

భార్యాభర్తల గొడవలు మొదటి నుండి గమనిస్తున్న వెంకట్రావు కొడుకు కాపురం సరిదిద్దాలని “పోనీ.. కోడలు చెప్పినట్లే సిటీలో కాపురం పెట్టరాదయ్యా? సిటీకి మన ఊరికి ఎంత దూరం అని, ఏమైనా క్షణాల్లో మీరు ఒకరి దగ్గరికి ఇంకొకరు చేరుకోవచ్చు” అంటూ కొడుకుని వేరు కాపురం పెట్టించడానికి ఒప్పించాలని చూశాడు.

“నువ్వు కూడా కోడలికి వత్తాసు పలుకుతావేమిటి నాన్నా? రేపు మీకు ఏ అపరాత్రో ఏదన్నా అయితే ఎవరు దిక్కు?” అంటూ తల్లిదండ్రుల పట్ల తనకున్న బాధతను తండ్రికి గుర్తు చేశాడు.

“మాకు ఏమీ కాదులేరా పిచ్చినాన్నా. నువ్వు ఎక్కడున్నా సుఖంగా ఉండటమే మాకు కావలసింది” వెంకట్రావు తల్లి కూడా మొగుడికి వత్తాసు పలికింది.

తల్లిదండ్రులిద్దరూ నచ్చచెప్పడంతో వెంకట్రావు సిటీలో కాపురం పెట్టడానికి ఒప్పుకున్నాడు. కానీ తన ఉద్యోగాన్ని మాత్రం ట్రాన్స్ఫర్ చేయించుకోలేదు.

సిటీలో కాపురం పెట్టి, రోజూ బస్సులో ఉద్యోగ నిమిత్తం తన ఊరు వెళ్లి రావటం మొదలు పెట్టాడు వెంకట్రావు. ఉద్యోగం వంకతో తల్లిదండ్రుల యోగక్షేమాలు ప్రతిరోజూ ప్రత్యక్షంగా విచారించవచ్చని ఆ పని చేశాడు.

మొదట్లో రోజూ తిరగటం కాస్తంత కష్టంగా ఉన్నా నా తల్లిదండ్రుల పట్ల తన బాధ్యత గుర్తొచ్చినప్పుడల్లా ఆ కష్టాన్ని మరచిపోయాడు.

వరలక్ష్మి కూడా సిటీలో కాపురం పెట్టడంతో ఏదో ఒక రకంగా తన కోరిక తీరిందని సరిపెట్టుకుంది. సిటీలో కాపురం పెట్టిన దగ్గర నుండి ఇంటిఖర్చు అమాంతంగా పెరిగిపోయింది. దానికి కారణం కొంతవరకు వరలక్ష్మి.

ఎదురింటివాళ్లు పిలిచారని ఒకరోజు, పక్కింటివాళ్లు తోడు రమ్మన్నారని మరో రోజు, ఇలా వారానికి నాలుగు రోజులు షాపింగ్‌ల పేరుతో పనికి వచ్చేవి, పనికి రానివి ఎడా పెడా కొనేస్తూ ఇల్లంతా సామాన్లతో నింపడం మొదలెట్టింది.

**“చుట్టుపక్కలవాళ్లు పొలాలను మంచి రేటుకు అమ్ముకుని ఆ డబ్బుతో సిటీలో పెద్ద బిల్డింగ్ కట్టుకుని మిగిలిన డబ్బు బిజినెస్ చేసి కోట్లు సంపాదిస్తున్నారని” రోజూ మొగుడ్ని సతాయించేది వరలక్ష్మి.**

పల్లెటూళ్లకు పట్నాలకు అదే తేడా. పల్లెటూళ్లో మనుషులు కేవలం వాళ్ల జీవనానికి అవసరమయ్యే వాటికి ఖర్చు పెడతారు. వాళ్లు ఖర్చు పెడదామన్నా సిటీలోలా అవసరమైన వస్తువులు అందుబాటులో ఉండవు.

ఒక రకంగా పల్లెటూళ్లలోనివాళ్లు అదృష్టవంతులని చెప్పాలి. అందుకనే వాళ్ల ఆదాయం తక్కువైనా సంతోషంగా బతకగలుగుతున్నారు.

కానీ పట్నాల్లో మనుషులు తమ జీవన అవసరాలకన్నా అనవసరమైన వస్తువులు కొని అప్పులపాలవుతున్నారు. మాల్స్ రూపంలో రకరకాల, రంగు రంగుల వస్తువులు కళ్లెదుట కనబడు తుంటే ఎవరికి మాత్రం కొనకుండా ఉండబుద్ధి అవుతుంది? పట్టణాల్లో వ్యాపారాలన్నీ ప్రజల బలహీనతలను ఆసరా చేసుకుని జరిగేవి.

పల్లెల్లో ఉండగా ఇప్పుడు తండ్రిని వెంకట్రావు ప్రతి నెల ఎంతో కొంత తండ్రికి సాయం చేస్తూ వచ్చేవాడు.

కానీ సిటీకి వెళ్లిన మూడు నెలల్లోనే తండ్రికి ఎదురు డబ్బులు ఇవ్వమని అడగాల్సి న పరిస్థితికి చేరుకున్నాడు వెంకట్రావు. అప్పటికిగాని పల్లెటూరి విలువ అత్త, మామ అవసరం తెలిసిరాలేదు వరలక్ష్మికి.

.............

కొడుకు కాలేజీ చదువులకు వచ్చేదాకా తండ్రి సహాయంతో అప్పులు చేయకుండా ఏదోలా కుటుంబాన్ని నెట్టుకొచ్చాడు వెంకట్రావు. కానీ కొడుకు అమెరికా వెళ్తానని తన కోరిక బయట పెట్టగానే ముందు తన ఆర్థిక పరిస్థితి దృష్ట్యా వద్దనుకున్నా, తల్లీ కొడుకులు ఇద్దరూ గట్టిగా పట్టుబట్టడంతో చేసేదిలేక ఒప్పుకున్నాడు.

కొడుకుని అమెరికా పంపాలంటే కనీసం పది లక్షలు కావాలి. పది లక్షలు అప్పు చేయాలంటే వడ్డీ తడిసి మోపెడు అవుతుంది. అన్ని రకాలుగా ఆలోచించి చివరకు ఊళ్లోని పొలం అమ్మటానికి నిశ్చయించుకున్నాడు వెంకట్రావు.

ఊరు వెళ్లినప్పుడు తన నిర్ణయాన్ని తండ్రి ముందుంచాడు.

"నేను భూమిని సొంత బిడ్డలా చూసుకున్నాను. ఈ భూమిని అమ్మి పట్నం రాను. నువ్వేమో పొలాన్ని అమ్మమంటున్నావు. కనీసం మేం బతికున్నంత వరకైనా పొలం అమ్మకుండా చూడరా!" అంటూ కళ్లనీళ్ల పెట్టుకున్నాడు వెంకట్రావు తండ్రి రాఘవయ్య.

ఆ మాటలకు ఏం జవాబు చెప్పాలో తెలియక మౌనంగా తల వంచుకున్నాడు వెంకట్రావు.

"ఏమయ్యా, ఈ ఆస్తి మొత్తానికి వారసుడు మన ఒక్కగానొక్క మనవడే కదా! వాడి భవిష్యత్తుకు ఉపయోగపడని ఆస్తి ఉన్నా ఒకటే లేకున్నా ఒకటే. మనం మాత్రం ఇంకెంత కాలం బతుకుతాం" అంటూ వెంకట్రావు తల్లి తన భర్తకు నచ్చజెప్పడంతో కాస్త మెత్తబడ్డాడు రాఘవయ్య.

"మీ అమ్మ చెప్పేది కూడా నిజమే. ఆస్తులు సంపాదించేది బిడ్డల భవిష్యత్తు కోసమే కదా! సరే, ఒక ఎకరా అమ్మి డబ్బులు ఇస్తాను. ఆ డబ్బుతో నీ కొడుకుని అమెరికా పంపు" అని వెంకట్రావుకి అభయమిచ్చాడు రాఘవయ్య.

తండ్రి ఒప్పుకోవడంతో కొండంత భారం నెత్తి మీద నుండి దిగిపోయినందుకు సంతోషించాడు వెంకట్రావు.

వెంకట్రావు కొడుకు అమెరికా వెళ్లిన తర్వాత అక్కడే ఉద్యోగం సంపాదించి స్థిరపడిపోయాడు. ఆ తర్వాత ఒక్కసారి ఇండియాకు వచ్చాడు.. అదీ కన్న తల్లిదండ్రులను చూడటానికి కాదు తన పెళ్లికి.

పెళ్లయిన నెలకు మళ్లీ అమెరికా వెళ్లి ఇప్పటివరకు తల్లిదండ్రుల మొహం కూడా చూడలేదు. అంతా ఫోన్లు మీదే గడచిపోతున్నాయి అనుబంధాలన్నీ.

..........

"ఏమిటో ఆలోచనలో పడ్డావ్?" వెంకట్రావు పిలుస్తుంటే మళ్లీ ఈ లోకంలోకి వచ్చి పడింది వరలక్ష్మి.

"ఏదో తొందరపాటు వల్ల నా నోట్లో నుంచి వచ్చేసింది. నా మాటలు ఏవీ పట్టించుకోకు" అంటూ భార్యతో అన్నాడు వెంకట్రావు.

"మీరు పైకి నోటితో అన్నా లేక మనసులో అనుకున్నా మీరన్నది నిజం. ఆ రోజు నేను ఎంత అవివేకంగా ప్రవర్తించాను. ఇప్పుడు తలుచుకుంటే నా మీద నాకే అసహ్యం వేస్తోంది" అంటూ సిగ్గుతో తల వంచుకుంది వరలక్ష్మి.

"ఏ విషయమైనా పిల్లలు వాళ్ల తల్లిదండ్రుల నుండి నేర్చుకుంటారు. మనం మన పెద్దవాళ్లను గౌరవంగా చూసుకుంటే మన పిల్లలు కూడా మనల్ని గౌరవంగా చూస్తారు.

ఆ రోజున మనం మన పెద్దవాళ్లను దూరంగా పెట్టాను, ఈ రోజున మనవాడు మనల్ని దూరంగా పెడుతున్నాడు. ఇప్పుడు ఇంత దూరం, అంత దూరం అని బాధపడితే ఏం లాభం?" అంటూ కొడుకు తప్పేమీ లేదన్నట్లు భార్యను ఓదార్చాడు వెంకట్రావు.

"అవునండీ, ఆ రోజున పెద్దవాళ్ల విలువ నాకు తెలియలేదు. ఉమ్మడి కుటుంబాల్లో స్వేచ్ఛ ఉండదని చెప్పుడు మాటలు విని అన్నానే కానీ అందరం కలిసి వుంటే ఒకరికొకరం కష్టసుఖాలు

"ఏమిటో
ఆలోచనలో పడ్డావ్?"
వెంకట్రావు పిలుస్తుంటే మళ్లీ ఈ
లోకంలోకి వచ్చింది వరలక్ష్మి.
"ఏదో తొందరపాటు వల్ల నా నోట్లో నుంచి
వచ్చేసింది. నా మాటలు ఏవీ పట్టించుకోకు"
అన్నాడు వెంకట్రావు.
"మీరు పైకి నోటితో అన్నా లేక మనసులో
అనుకున్నా మీరన్నది నిజం" అంది
వరలక్ష్మి.

పంచుకోవచ్చన్న విషయమే మర్చిపోయాను. నేను మిమ్మల్ని మీ తల్లిదండ్రుల నుండి దూరం చేసాను. అందుకేనేమో భగవంతుడు నా కొడుకు కోడలిని నాకు దూరం చేస్తున్నాడు" అంటూ కళ్లనీళ్ల పెట్టుకొని అంది.

"దిగులుపడకు... దూరమైనా, దగ్గరైనా అంతా మన చేతుల్లోనే ఉంది. మా అమ్మా నాన్నలు మనకు సాయపడటంతో వాళ్ల విలువ మనకు తెలిసి వచ్చింది. అదే విధంగా మనం కూడా అబ్బాయి పిలిచినా పిలవకపోయినా వాళ్ల అవసరాలకు సాయపడితే- ఎలా అయితే నువ్వు మా అమ్మా నాన్నల విలువను గుర్తించావో, అలాగే వాళ్లు కూడా మన విలువను గుర్తిస్తారు. అప్పటి వరకు కాస్త ఓపిక పట్టక తప్పదు.

"మీరు చెప్పింది నిజమేనా?" అన్నట్లు తల ఊపుతూ భర్తతో పాటు కొడుక్కి మంచి ఇల్లు వెతకడానికి తనూ బయలుదేరింది, తమ మధ్య పెరిగిన దూరం ఒక అడుగు తగ్గకపోతుందా? అన్న ఆశతో. ✦

# రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం.**
**రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి.**
**ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా:**
**ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**
**sunmagvaartha@gmail.com**

# గాంధీజీపై డాక్యుమెంటరీ

యామిజాల జగదీశ్

జాతిపిత గాంధీజీపై ఆయన ఉన్న రోజుల్లోనే తొలిసారిగా డాక్యుమెంటరీ తీసి చరిత్ర సృష్టించిన ఎ.కె.చెట్టియార్ తమిళంలో యాత్రా సాహిత్యం అనే నూతన సాహిత్య ప్రక్రియకు మార్గదర్శి.

1911 నవంబరు మూడో తేదీన తమిళనాడులోని కారైక్కుడి సమీపంలో గల కోట్టయూరులో జన్మించిన ఎ.కె.చెట్టియారుకి తల్లిదండ్రులు పెట్టిన పేరు కరుప్పన్. బాల్యంలో తిరువణ్ణామలైలో చదువుకున్న ఈయనకు చిన్నప్పటి నుంచే రాయడం పట్ల ఆసక్తి ఎక్కువ. అలాగే గాంధీజీ అంటే గౌరవం, అభిమానం.

పదిహేడో యేట ఈయన రాసిన 'శారదాంబాళ్-సిరు తమాష్' అనే కథ ఆనంద విగటన్ అనే తమిళ పత్రికలో అచ్చయ్యింది. ఈ పత్రిక స్థాపనలోనూ ఈయన ఎంతగానో సహకరించారు.

1930లో బర్మాలో ధనవణిగన్ అనే మాసపత్రికకు నిర్వాహక సంపాదకుడిగా ఉండిన ఇతను 1935లో జపాన్ ఇంపీరియల్ ఆర్ట్స్ కేంద్రంలో చేరి ఫొటోగ్రఫీలో శిక్షణ పొందారు. అక్కడి నుంచి న్యూయార్క్ వెళ్లి ఫొటోగ్రఫీ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి ఒక సంవత్సరం డిప్లొమా చేశారు.

మహాత్మాగాంధీ జీవిత చరిత్రపై డాక్యుమెంటరీ తీయడం కోసం ఆయన 1937లో ఎస్.ఎస్.సమరియా అనే నౌకలో దక్షిణాఫ్రికాకు వెళ్లారు. అక్కడి నుంచి వివిధ దేశాలను సందర్శించారు. ఈ పర్యటనల ద్వారా యాభై వేల అడుగుల ఫుటేజీలను సేకరించి అందులో నుంచి పన్నెండు వేల అడుగుల మేరకు ఎడిట్ చేసి మహాత్మాగాంధీ చిత్రాన్ని తమిళంలో తయారు చేసి 1940లో విడుదల చేయడం విశేషం. గాంధీజీపై ఆయన జీవించి ఉన్న రోజుల్లోనే ఓ డాక్యుమెంటరీ రూపొందించిన ప్రప్రథముడిగా ఎ.కె.చెట్టియార్ చరిత్రపుటలకెక్కారు. సెన్సార్ బోర్డువారి అనుమతితో మొదట్లో ఈ డాక్యుమెంటరీని సినిమాగా ప్రదర్శించారు. తమిళంలో వచ్చిన మొదటి డాక్యుమెంటరీ ఇదే. 1940లో



చెన్నైలోని రాక్సీ థియేటర్‌లో తమిళంలో 'వాయిస్ ఓవర్'తో విడుదల చేశారు. అనంతరం కొన్ని రోజులకే ఆయన దీనిని తెలుగులోకి అనువదించి విడుదల చేశారు. ఆ తర్వాత హిందీలో డబ్ చేసి ఈ డాక్యుమెంటరీని 1947 ఆగస్టు పదిహేనో తేదీన న్యూఢిల్లీలో ప్రదర్శించినప్పుడు మన దేశ మొట్టమొదటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ తదితర ప్రముఖులు వీక్షించారు. దేశ ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఈ ప్రదర్శనకు కొన్ని కారణాల వల్ల రాలేకపోవడంతో ఆయన కుమార్తె ఇందిరాగాంధీ ఈ డాక్యుమెంటరీని తిలకించారు.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తమిళం, తెలుగు భాషలలో 1948 ఆగస్టు 23న ఒకేసారి విడుదల చేశారు. కానీ ఇవేవీ ఇప్పుడు అందుబాటులో లేకపోవడం విచారకరం.



మరికొన్ని రోజులకు చెట్టియార్ దీనినే ఇంగ్లీషులోకి అనువదించి అమెరికాకు తీసుకెళ్లారు. అక్కడ శాన్‌ఫ్రాన్సిస్కోలో 1953 ఫిబ్రవరి పదో తేదీన ప్రదర్శించినప్పుడు అప్పటి అమెరికా అధ్యక్షుడు డ్వైట్ డేవిడ్ ఐసన్హోవర్, ఆయన భార్య ఎం.జెనీవా డౌడ్ మొదలైనవారు తిలకించారు.

ఆ తర్వాత చెట్టియార్ ఈ డాక్యుమెంటరీ తాలూకు 16 ఎం.ఎం.చిత్రాలను తీసి 1959లో కొన్ని మ్యూజియంలకు పంపిణీ చేశారు.

కనిపించకుండా పోయిందనుకున్న ఈ గాంధీజీ డాక్యుమెంటరీని ఆ.రా.వేంకటాచలపతి అనే ఆయన శాన్‌ఫ్రాన్సిస్కో రాష్ట్ర విశ్వవిద్యాలయంలో పరిశోధించి 2006 జనవరి 19న చెన్నైలో ప్రదర్శించారు.

'మహాత్మా గాంధీ-ట్వెంటియెత్ సెంచరీ ప్రొఫెట్' అనే ఈ యాభై అయిదు నిమిషాల సినిమాలో 1912లో గోఖలే జరిపిన దక్షిణాఫ్రికా పర్యటనను, గాంధీజీతో ఆయన కలయికను, నెహ్రూ రాట్నం తిప్పుతున్న దృశ్యం, ఉప్పు సత్యాగ్రహం చేపట్టిన గాంధీజీ దండియాత్రలో భాగంగా సముద్ర స్నానం చేయడం వంటి అరుదైన దృశ్యాలను ఇందులో చూడవచ్చు.

ఇక పలు దేశాలలో పర్యటించిన తన యాత్రానుభవాల గురించి పుస్తకాలు రాసి పాఠక లోకానికి అందించారు చెట్టియార్. ఈ రచనలతో ఆయన 'ప్రపంచాన్ని చుట్టిన తమిళుడు' అని ఖ్యాతి గడించారు.

అలాగే ప్రయాణ జ్ఞాపకాలు, మలేసియా మొదలుకొని కెనడా వరకు, గయానా మొదలుకుని కాస్పియన్ సముద్రం వరకు, ఐరోపియా గుండా లాంటి మరికొన్ని పుస్తకాలను కూడా ఆయన రాశారు.

పబ్లిసిటీ అంటే ఇష్టం లేని వ్యక్తి కావడంతో ఆయన ఫొటోలు లభించడం కూడా అరుదైపోయింది. తమిళ జాతీయ కవి సుబ్రమణ్య భారతియారుతో మంచి అనుబంధమున్న చెట్టియార్ భారతియార్ రచనలలో కొన్నింటిని వెలువరించడంలో ఈయన కీలకపాత్ర పోషించారు.

1943లో కుమరి మలర్ అనే మాసపత్రికను తమిళంలో ప్రారంభించారు. స.వయ్యాపురి పిళ్ళై, క.అ.నీలకంఠ శాస్త్రి, టి.ఎస్. చొక్కలింగం, ఎ.ఎన్.శివరామన్, భారతిదాసన్, టి.కె.సి., వరదరాజన్, తి.జానకిరామన్, కల్కి, న.పిచ్చమర్తి, కు.ప.రాజగోపాలన్, కు.అళగిరిసామి తదితర సాహితీవేత్తలు ఈ పత్రికకు ఆర్టికల్స్ రాశారు. 1850 మొదలుకుని 1925 వరకు అనేక పత్రికలలో వచ్చిన 140 వ్యాసాలను సంకలనపరచి 'తమిళనాడు యాత్రా వ్యాసాలు' అనే పుస్తకాన్ని విడుదల చేశారు.

తమిళంలో యాత్రా సాహిత్యాన్ని మొదలుపెట్టి తదనంతరం ఎందరికో ఆదర్శంగా నిలిచిన చెట్టియార్ 1983 సెప్టెంబర్ పదో తేదీన తన డెబ్బై రెండో యేట తుది శ్వాస విడిచారు.




# అమ్మ భాష మనుగడ కోసం..

**జయసూర్య**

మనసులోని భావాలను వ్యక్తీకరించడం కోసం పుట్టిన మాట, పలుకును భాష అంటున్నాం. పసితనంలో మాటలు రాని వయసులో పిల్లలు ఏడుపు ద్వారా క్రమేపీ మాటలు వచ్చేవరకు, తల్లికి తమ భావం అందిస్తారు. అమ్మ, పిల్లలకు వచ్చీ రాని మాటలు నేర్పడం, పిల్లలు అక్షరాలు నేర్చుకొనే వరకు అవే మాట్లాడటం పసి జీవన పరిణామంగా, సహజమైంది. అక్షరాభ్యాసం తర్వాత క్రమేపీ మాట, రాతగా మారుతుంది. అమ్మ ఒడిలో వున్నప్పుడు, తల్లిపాలు, క్రమేపీ గోరంత ముద్దలు, ముద్దులు తల్లిప్రేమ, జోలపాటలు పిల్లల ఆకలి తీర్చడం నిద్రపుచ్చటం కోసం అమ్మ తపన యింతా అంతా కాదు. నిరక్షరాస్యులైన తల్లులు కూడా అనుశ్రుతంగా వినడం ద్వారా తెలుసుకొన్న పలుకుబడితో పిల్లలను లాలిస్తారు. అందువలన అక్షరాలు పలకడం నాందిగా భాష ఆవిర్భవించింది.

వ్రాత లేదా రాత అంటే లేఖనం, లిపి. అక్షరాలు దిద్దటంతో శ్రీకారం చుట్టబడిన రాత నాటి దైనందిన సమాజంలోకి రాతగాడు, లేఖకుడు, లేకరి ద్వారా ప్రవేశించింది. అందరికీ రాయడం, చదవడం రాని రోజులలో అప్పుపత్రాలు, భత్య ఖర్చులు, దస్తూరి, ఉత్తర ప్రత్యుత్తరాలు, ఇచ్చి పుచ్చుకొనే పత్రాలు రాయసకాడు, లేఖాధికారి, లేఖకుల అధీనంలో నిర్వర్తించబడేవి. తెలుగు పదజాలం ప్రాచీన శాసనాలలో ఉన్నా, పండితులకు, విద్య నేర్చుకొన్న కుటుంబాలకే నాడు రాయడం, సాహిత్య సృష్టి పరిమితం అయింది. పురాణాలు ఇతిహాసాలు, ప్రబంధాలు ప్రవచనాల రూపంలో వినటం తప్ప గ్రామీణులు, పామరులు రాయడం గురించి పట్టించుకోలేని కాలం అది. జనం విద్యాగంధానికి దూరం కావడంతో భాష కొందరి ఆధిపత్యంలోనే వుండి సామాన్య జనావళికి దూరం అయింది. నేలంటు చదువులు, అక్షరాలు నేలపై గుంటలు పడేటట్టు రాయడం ఆ గుంటలలో పిల్లలచే అక్షరాలు రాయించడం, దిద్దించడం గుంట ఓనమాల ప్రాచీనత నుంచి పద్య గ్రంథ సాహిత్యం, క్రమేపీ ముద్రణా సౌలభ్యం ఏర్పడింది.

శతాబ్దాల కాలం నాటి పరిస్థితులలో కేవలం శ్రుత పాండితీ భాషగా వున్న మన మాతృభాష ప్రస్తుత 21వ శతాబ్ద కాల పరిభ్రమణంలో, అక్షరాస్యత వెల్లివిరిసినా, తాటి ఆకుల వరవడి నుంచి కంప్యూటర్ భాషగా అధునాతన సంతరించుకొన్నా, దేశ విదేశాలలో అత్యధిక శాతం మాట్లాడే భాషగా ప్రవర్ధిల్లుతున్నా ప్రస్తుతం రాతభాషగా తెలుగు నిరాదరణకు గురి అవుతోంది.

మన మాతృభాష భవిష్యత్ తరాలకు సజీవంగా అందించే మనుగడ సాగించాలంటే కేవలం తెలుగు మాట్లాడితే సరిపోదు. ప్రతీ భాషకు మూడు ప్రధాన జీవాంశాలున్నాయి. మాట్లాడటం, చదవడం, రాయడం. జాతీయ స్థాయిలో అత్యధిక శాతం దేశ, విదేశాలలో మాట్లాడే భాషగా తెలుగు కీర్తిప్రతిష్ఠలు సాధించింది. ప్రాచీన కాలంలో, పండిత, పద్య సాహితీ ప్రక్రియలో అద్వితీయ ప్రతిభా సంపన్నత కలిగిన తెలుగు ఇంటి భాషగా మిగిలిపోయే ప్రమాదం పొంచి వుంది.

స్వాతంత్ర్యానంతరం ఉద్యోగ, ఉపాధి అవసరాల ప్రాధాన్యత దృష్ట్యా ఆంగ్ల భాషా ప్రావీణ్యం అవసరమైంది. మన యువతలో డిజిటల్ యుగ ఆవిర్భావం కారణంగా ఇంట్లో తెలుగు మాట్లాడేవారు కూడా తెలుగు పుస్తకాలు చదవలేకపోతున్నారు. చదవటమనే పఠనాసక్తి త్వరితంగా క్షీణిస్తున్న అధునాతన సమాజంలో యిక రాయడం గగన సదృశం అవుతోంది. ఒకానొక కాలంలో నిరక్షరాస్యులైన జనసామాన్యానికి మాతృభాష రాయడానికి, చదవడానికి దూరం అయినట్టే, ఇప్పుడు విద్యార్థి యువలోకానికి మాట్లాడటం వచ్చినవారికి కూడా తెలుగు చదవడం, రాయడం అబ్బురమైంది. వారేకాదు, యువ తల్లిదండ్రులు కూడా అంతే. సెల్‌ఫోన్లు, కంప్యూటర్ల కారణంగా మారిపోయిన జీవన శైలిలో ఉత్తర ప్రత్యుత్తరాలు లేని ఈ రోజులలో చదవడం, రాయడం లేని భాషగా తెలుగు విలసిల్లుతోంది. దానికితోడు వ్యవహారిక భాషా వికాసానికి ప్రాణప్రతిష్ఠ చేసిన పత్రికల ప్రాధాన్యతకు టి.వి.చానల్స్ ప్రసారాలు దెబ్బతీసాయి.

భాష మనుగడకు మాట్లాడటంతో పాటు రాయడం చదవగలగడం చేయగలగాలి. అందరూ కాల్పనిక సాహిత్యం సృష్టించలేకపోవచ్చు. కానీ పుస్తకాలు తేలికగా చదవడం, ఉత్తరాలు, మరేదైనా రాయడం చేయగలిగే విధంగా బాల బాలికలను ప్రోత్సహించాలి. తెలుగు పద్యం మనోజ్ఞమైనది, మధురమైనది, సుందరమైనది మరే భాషలోనూ లేదు. తెలుగు సంస్కృతికి, జీవితానికి, తెలుగుతనానికి బాంధవ్యం ఎంతైనా ఉంది. ఈ రోజులలో మా పిల్లలకు మాట్లాడటం వచ్చుగానీ చదవడం, రాయడం రాదు అని చాలామంది తల్లిదండ్రులు మహానగరాలలో పరిసర రాష్ట్రాల తెలుగు కుటుంబాలలో అంటున్నారు.




మాతృభాషలో రాయడం నేర్చుకొంటే మాట్లాడటంతో పాటు భాష మరింత వికసిస్తుంది. పాఠశాలలలో తెలుగు అక్షరాలు నేర్పి కనీసం చదవడం, రాయడం బాలబాలికలకు ప్రాథమిక పాఠ్యాంశాలుగా తప్పనిసరిగా, విద్యాబోధనలో భాగంగా ప్రవేశపెట్టాలి. ప్రస్తుత సమాజంలో చదువు కొందరికే కాదు అందరికీ. అక్షరాస్యతా ప్రచారానికి బతుకుతెరువు దృష్ట్యా ప్రాధాన్యత వుంది. పల్లెలు పట్టణాలుగా, పట్టణాలు నగరాలుగా ఎదుగుతున్న రోజులలో, గుప్పెట్లో ప్రపంచం ఇమిడిపోయిన ప్రస్తుతంలో తెలుగు ప్రజ మాతృభాషలో మాట్లాడాలని, రాయాలని, పుస్తకాలు విరివిగా చదవాలని, తెలుగును నవతరానికి చేరువ చేయాలని భాషోద్యమంగా ప్రభుత్వాన్ని నిలదీయక తప్పదు.

# అకారణ కోపం మంచిది కాదు



**కస్తూరి మురళీకృష్ణ**

**అది శాస్త జేతవనంలో విహరిస్తున్న కాలం. ఆ కాలంలో ఆయన చీటికీ మాటికీ కోపం తెచ్చుకునే ఓ భిక్షువు గురించి చెప్పారు. ఆ కథ చెప్పే ముందు భిక్షువులతో ఆయన “నువ్వు బుద్ధుడి సిద్ధాంతాలను నమ్మావు, స్వీకరించావు. అయినా ఎందుకని కోపాన్ని నువ్వు వదలలేకపోతున్నావు? కోపం హానికారకం. పూర్వ కాలంలో పండితులు కోపాన్ని వదలుకోవాలని నిశ్చయించుకున్న తరువాత తమకు వేల సంఖ్యలో దెబ్బలు తగిలినా, వాళ్ల చేతులు, కళ్లు, ముక్కులు తెగిపోయినా అందుకు కారణమైన వారిపైన కోపాన్ని ప్రదర్శించలేదు. అంతగా కోపాన్ని నియంత్రించుకున్నారు” అన్నారు.**

శాస్త మాటలు విన్న బౌద్ధ భిక్షువులలో ఆ గాథ తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది. వారంతా తమకు ఆ గాథ చెప్పమని శాస్తను అభ్యర్థించారు.

వారి అభ్యర్థనను మన్నించి బుద్ధుడు ఆ గాథను చెప్పటం ఆరంభించాడు.

.........

అది వారణాసిలో కలంబువు అనే కాశీరాజు రాజ్యం చేస్తున్న కాలం. ఆ సమయంలో బోధిసత్త్వుడు బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. అతడి పేరు కమండక కుమారుడు. వారికి ఎనిమిది కోట్ల ధనం ఉండేది. ఆ కుటుంబంలో జన్మించిన బోధిసత్త్వుడు విద్యాబుద్ధులు నేర్చాడు. తక్షశిలకు వెళ్లి అన్ని విద్యలు నేర్చాడు. విద్యార్జన పూర్తయిన తరువాత వారణాసి తిరిగి వచ్చి కుటుంబ బాధ్యతలు నిర్వహించటం ప్రారంభించాడు.

కొన్నాళ్లకు అతని తల్లిదండ్రులు మరణించారు. అప్పుడు అతడు తమ పూర్వీకులు పోగు చేసి, తనకు వారసత్వంగా ఇచ్చిన ధనాన్ని చూశాడు, ఆలోచించాడు.

“నా తల్లిదండ్రులతో సహా నా పూర్వీకులంతా కలసి ఇంత ధనాన్ని పోగు చేశారు. వారెవ్వరూ ధనాన్ని వెంట తీసుకుని పోలేదు. నా కోసం అంతా వదలి వెళ్లారు. రేపు నేను మాత్రం ఈ ధనాన్ని వెంట తీసుకుని పోతానా? ఇక్కడనే వదలిపోతాను. ఇక్కడే వదలిపోయేదాని కోసం జీవితాంతం తాపత్రయపడాల్సిన అవసరం ఏముంది? దానికోసం జీవితాంతం శ్రమించాల్సిన అవసరం ఏముంది? ఇక్కడే వదిలిపోయే ధనం కోసం జీవితాన్ని వ్యర్థంగా గడపాల్సిన అవసరం ఏముంది?”

ఇలా ఆలోచించిన బోధిసత్త్వుడు తన దగ్గర పోగయిన ధనాన్నంతా అర్హులయిన వారికి పంచేశాడు.

ధనమంతా అందరికీ పంచేసి ప్రవ్రజించాడు. హిమాలయాలకు చేరి కందమూలాలు తింటూ జీవించనారంభించాడు.

హిమాలయాలలో కొన్ని నెలల లవణం, ఆమ్లాలు లభించవు. ఆ కాలంలో వాటికోసం భిక్షాటన చేస్తూ గ్రామాలు తిరిగాడు. అలా సంచరిస్తూ వారణాసి చేరాడు. వారణాసిలో రాజోద్యానవనంలో ప్రవేశించాడు.

అతడిని గుర్తించిన సేనాపతి అతడిని తన ఇంటికి తీసుకువెళ్లాడు. తన పరిచర్యలతో ఆయనను సంతృప్తిడిని చేశాడు. చక్కటి భోజనం పెట్టాడు. ఆయన అందించిన ఉపదేశాన్ని విన్నాడు. అంతా అయిన తరువాత మళ్లీ ఆయనను రాజోద్యానవనంలో దింపాడు.

బోధిసత్త్వుడు రాజోద్యానవనంలో నివసిస్తున్న సమయంలో వారణాసి రాజు కలంబు తన పరివారంతో ఆ ఉద్యానవనానికి వచ్చాడు. మహావైభవంతో అతని వెంట ఉన్నవారు ఆడేరు, పాడేరు. మద్యపానం చేసిన రాజు మత్తులో తనకు ఇష్టమైన ప్రేయసి ఒడిలో తల పెట్టుకుని నిద్రించాడు.

రాజు నిద్రించటంతో అంతవరకూ అతడిని తమ ఆటపాటలతో మెప్పించిన పరివార గణానికి ఏం చేయాలో తోచలేదు.

“మనం ఎవరిని మన ఆటపాటలతో మెప్పించాలనుకున్నామో అతడు నిద్రిస్తున్నాడు. ఇప్పుడు మనమెంత ఆడి పాడినా లాభంలేదు. పైగా అతడికి నిద్రాభంగం అయ్యే వీలుంది. అది అతని ఆగ్రహ కారణం అవుతుంది. అనుగ్రహం బదులు ఆగ్రహాన్ని అనుభవించాల్సి వస్తుంది. అనుకుని వారు తమ వాయిద్యాలన్నీ అక్కడే విడిచి, ఆ వనంలో విహరించసాగారు.

అలా విహరిస్తున్న వారికి ఉద్యానవనంలో ఓ మామిడి చెట్టు కింద తపస్సులో మునిగి ప్రశాంతంగా ఉన్న బోధిసత్త్వుడు కనిపించాడు.



అతడిని చూసిన వారికి సంతోషంగా అనిపించింది. “ఇక్కడ చూడండి.. ఈయన ఎంత ప్రశాంతంగా ధ్యానంలో ఉన్నాడో!

రండి... ఇక్కడ కూర్చుందాం. ఈయన ఇచ్చే ఉపదేశాన్ని విందాం” అనుకున్నారు.

అందరూ బోధిసత్త్వుడి చుట్టూ చేరారు.

ఆయన వారికి ఉపదేశాన్ని అందించాడు.

ఆడి పాడే స్త్రీలు ఎవ్వరూ కనబడలేదు. "వీళ్లంతా ఎక్కడికి వెళ్లారు?" అడిగాడు రాజు.

"వనంలో ఉన్న తాపసి దగ్గరకు వెళ్లారు. ఆయన దగ్గర కూర్చున్నారు" సమాధానం వచ్చింది.

సమాధానం విన్న రాజుకు కోపం వచ్చింది.

కత్తి తీశాడు. "ఎవడా దుష్ట తాపసి? వాడికి బుద్ధి చెప్తాను" అని లేచాడు.

కోపంగా కత్తితో వస్తున్న రాజును స్త్రీలు చూశారు.

వాళ్లు పరుగున ఆయనను చేరుకుని, ఆయన చేతిలోని కత్తిని లాక్కున్నారు. అనునయ వదనాలతో ఆయనను శాంతపరచారు.

కానీ రాజు కోపం తగ్గలేదు.

అతడు కోపంగా శ్రమణుడి దగ్గరకు వచ్చి అడిగాడు.

"శ్రమణా, నీ వాదం ఏమిటి?"

"నాది క్షాంతి వాదం"

"ఎలాంటి శాంతి నీది?"

"ఎవరెంత దూషించినా, హేళన చేసినా, రెచ్చగొట్టినా కోపం రాకుండా ఉండటం నా వాదం" శాంతంగా జవాబిచ్చాడు శ్రమణుడు.

"నీ శాంతం, నీ ఓర్పులను నేను పరీక్షిస్తాను" అన్నాడు రాజు.

**"శ్రమణా, నీ వాదం ఏమిటి?"**

**"నాది క్షాంతి వాదం"**

**"ఎలాంటి శాంతి నీది?"**

**"ఎవరెంత దూషించినా, హేళన చేసినా, రెచ్చగొట్టినా కోపం రాకుండా ఉండటం నా వాదం" శాంతంగా జవాబిచ్చాడు శ్రమణుడు.**

రాజ్యంలో దొంగలను శిక్షించే వాడిని పిలిచాడు.

పసుపు బట్టలు ధరించి, ఎర్రటి పూలమాలతో ఉన్న పశువులాంటి ఓ వ్యక్తి కఠినమైన కొరడాతో వచ్చాడు.

రాజుకు నమస్కరించి రాజాజ్ఞ కోసం ఎదురు చూస్తూ నిలబడ్డాడు.

"ఈ దొంగసన్యాసిని ఈడ్చిపారేసి ముళ్లకొరడాలతో రెండు వేల దెబ్బలు కొట్టు" ఆజ్ఞాపించాడు రాజు.

రాజాజ్ఞను వాడు మౌనంగా పాటించాడు. తాపసిని లాగిపారేసి నిర్దాక్షిణ్యంగా రెండు వేల దెబ్బలు వేశాడు.

బోధిసత్త్వుడు చర్మం లేచిపోయింది. మాంసం కనబడుతోంది. రక్తం కారసాగింది.

"ఓ భిక్షా, ఇప్పుడు చెప్పు నీదేం వాదం?" అడిగాడు రాజు.

"మహారాజా, నాది క్షాంతి వాదం. క్షాంతి అంటే ఓర్పు, సహనం. ఓర్పు, సహనం అన్నది చర్మంలో ఉండదు. అది హృదయంలో ఉంటుంది. మీరు శరీరాన్ని ఎంతగా హింసించినా నా ఓర్పులో మార్పు ఉండదు" అన్నాడు.

అతడి మాటలకు రాజుకు మరింతగా కోపం వచ్చింది.

రాజు శిక్షకుడికి ఆజ్ఞ ఇచ్చాడు.

"ఇతడి రెండు చేతులు ఖండించు"

కొరడా పారేసి గొడ్డలి తీసుకున్నాడు శిక్షించేవాడు. నిర్దాక్షిణ్యంగా ఆ గొడ్డలితో బోధిసత్త్వుడి రెండు చేతులు ఖండించాడు.

అయినా బోధిసత్త్వుడు క్రోధం ప్రదర్శించలేదు. బాధ చూపలేదు.

"ఇప్పుడేమంటావు?" అడిగాడు రాజు.

"శరీరానికి ఎలాంటి భావాలుండవు. నా హృదయంలో ఉన్నది ఒకటే భావం క్షాంతి" అన్నాడు బోధిసత్త్వుడు.

"కాళ్లు కత్తిరించెయ్" ఆజ్ఞాపించాడు రాజు.

బోధిసత్త్వుడి కాళ్లను ఖండించాడు.

"ఇప్పుడేం వాదం నీది?" అడిగాడు రాజు.

"క్షాంతి వాదం. నా వాదం కాళ్లల్లో, చేతుల్లో ఉన్నదనుకున్నారా? మీకు అందని ప్రదేశంలో ఉంది క్షాంతిభావన" సమాధానం ఇచ్చాడు బోధిసత్త్వుడు.

"ముక్కు, చెవులు కోసెయ్" ఆజ్ఞాపించాడు రాజు.

శిక్షించే అతడు రాజాజ్ఞ పాటించాడు.

బోధిసత్త్వుడి శరీరమంతా రక్తసిక్తమయింది.

"ఇప్పుడేం వాదం నీది?" అడిగాడు రాజు.

"క్షాంతి వాదం. క్షాంతి ముక్కు, చెవుల్లో వున్నదనుకున్నారా? హృదయాంతరాళ లోతుల్లో ఉన్నది క్షాంతి భావన" చెప్పాడు బోధిసత్త్వుడు.

రాజు కోపం పట్టలేకపోయాడు. తాను ఓడిపోయానన్న గ్రహింపు వల్ల కలిగిన అవమాన భారం కోపంగా పరిణమించింది.

కోపంతో బోధిసత్త్వుడి గుండెలపై కాలితో తన్నాడు "నీ క్షాంతిని నువ్వే పొగుడుకుంటూ పడి ఉండు" అని అక్కడి నుంచి వెళ్లిపోయిన తరువాత సేనాపతి బోధిసత్త్వుడి దగ్గరకు వచ్చాడు.

బోధిసత్త్వుడి శరీరంపై ఉన్న రక్తాన్ని తుడిచాడు. గాయాలకు మందు పెట్టి కట్లు కట్టాడు. అతడిని కూర్చుండబెట్టి ప్రణామం చేశాడు. బోధిసత్త్వుడు తేరుకున్న తరువాత అతని పక్కన కూర్చున్నాడు.

మెల్లిగా "మీకు రాజు చర్యల వల్ల ఆగ్రహం కలిగితే ఆ క్రోధాన్ని రాజు వరకే పరిమితం చేయండి. ఇతరుల వైపు మీ ఆగ్రహాగ్నిని ప్రసరింపచేయకండి" అని వేడుకున్నాడు.

బోధిసత్త్వుడు శాంతంగా సమాధానం చెప్పాడు.

"నా కాళ్లు, చేతులు, ముక్కు, చెవులు కోయించిన రాజు చిరకాలం అభివృద్ధి పొందాలి. ఆయనకు ఆయురారోగ్య ఐశ్వర్యాలు, అతనికీ, అతని రాజ్యంలో ప్రజలకు ప్రాప్తమవ్వాలి. నాకు ఎవ్వరి మీద ఎలాంటి క్రోధం లేదు" అన్నాడు.

అతడు ఆ మాటలంటూండగానే వృషభం వస్త్రాన్ని చీల్చినట్టు భూమి రెండుగా చీలిపోయింది. ఆ చీలిక నుండి అగ్నిజ్వాలలు ఆకాశానికి ఎగసాయి. రాజు ఆ ఉద్యానవనంలోనే భూమి చీలికలో పడి మరణించాడు.

బోధిసత్త్వుడు సైతం తగిలిన గాయాల నుండి కారిన రక్తం అధికం కావటంతో తన ప్రాణాలు విడిచాడు.

నగర ప్రజలు గంధపుష్పమాలలతో, ధూపదీపాలతో బోధిసత్త్వుడికి అంత్యక్రియలు చేశారు.

"క్షాంతి ప్రదర్శించిన శ్రమణుడు అభివృద్ధి చెందాడు అర్హత మార్గంతో. కాళ్లు, చేతులు కోయించిన రాజు నరకంలో పడ్డాడు.

ఆ కాలంలో రాజు దేవదత్తుడు, సేనాపతి సారిపుత్రుడు, క్షాంతివాది అయిన తపస్వి నేనే" అంటూ కథను ముగించాడు బుద్ధుడు.



బో కాప్



జోధ్‌పూర్

# రంగుల నగరాలు

ఒక్కో ఊరికి/నగరానికి ఒక్కో విధమైన గుర్తింపు ఉంటుంది. కోటలు, ఉద్యానవనాలు, చారిత్రాత్మకమైన కథనాలు, పుణ్యక్షేత్రం.. ఇలా వివిధ కారణాల వల్ల ఆ నగరాలకు పేరు ప్రఖ్యాతులు లభిస్తాయి. అయితే వీటన్నిటికి భిన్నంగా అక్కడి ఇళ్లన్నీ రంగు రంగుల్లో ఉండటం వాటి ప్రత్యేకత.



ఛెప్‌చావాన్



వాల్‌పారైసో

## ఇన్‌స్టాగ్రామ్ సిటీ.. బో కాప్

కేప్ టౌన్‌కు వెళ్లే పర్యాటకుల జాబితాలో తప్పనిసరిగా బో కాప్ ఉంటుంది. అక్కడ వున్న విభిన్నమైన రంగుల భవనాల వల్ల దానికి ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఇన్‌స్టాగ్రామ్‌గా పేరు సాధించింది.



బ్రిస్టోల్

## ఛెప్‌చావాన్

మొరాకోలో ఉంది ఛెప్‌చావాన్. ఇక్కడి ఇళ్లన్నీ నీలం రంగులో ఉంటాయి. కనుక దీనికి నీలంరంగు నగరమని పేరు వచ్చింది. దోమల నుండి కాపాడుకునేందుకు నగరాన్నంతా నీలం రంగుగా మార్చుకున్నారని కథనం. కారణం ఏదైనా అక్కడ దోమలైతే మచ్చుకైనా కనిపించవు. ఎటు చూసినా వివిధ రకాల నీలం రంగు షేడ్స్‌తో అలంకరించిన ఇళ్లు, భవనాలు కనిపిస్తాయి. దీనిని ది మోస్ట్ కలర్‌ఫుల్ సిటీ అని కూడా పిలుస్తారు.

## బ్రిస్టోల్

కలర్ క్యాపిటల్ ఆఫ్ యూకెగా పేరు గాంచిన బ్రిస్టోల్ ఏవాన్ నదీ తీరంలో ఉంది. అక్కడి ఇళ్ల యజమానులు ఎవరి అభీష్టం మేరకు వాళ్లు రంగులు వేసుకున్నా ఆ రంగులు విభిన్నంగా ఉండడం వల్ల ఆ నగరం ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది.

## జోధ్‌పూర్

మెహ్రాన్‌గఢ్ కోట నుండి చూస్తే జోధ్‌పూర్ నగరమంతా నీల రంగుతో కనిపిస్తుంది. దీనిని బ్లూ సిటీ అని కూడా పిలుస్తారు. ఇది ఎడారి ప్రాంతం కనుక ఎండల నుండి ఉపశమనం పొంద దానికి, పరమేశ్వరుని కంఠం గుర్తుగా నీలం రంగు వేసుకున్నట్లు తెలుస్తోంది.

## వాల్‌పారైసో

చిలీలోని కొండల మీద ఉందీ నగరం. ఇక్కడి రంగు రంగుల ఇళ్లు ఆ నగర ట్రేడ్ మార్క్‌గా మారాయట. స్ట్రీట్ ఆర్ట్‌కు సైతం ప్రసిద్ధి గాంచింది ఈ నగరం. యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా గుర్తింపు తెచ్చుకుంది వాల్‌పారైసో.



# అలవాట్లపై వాస్తు ప్రభావం?


## వాస్తువార్త



వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్స్: 9885446501/9885449458


**పి.కార్తిక - పిఠాపురం**

**ప్రశ్న: కొంతమంది వ్యసనాలకు గురవుతూ ఉంటారు. అలవాట్లపై వాస్తు ప్రభావం ఉంటుందా? వాస్తు బాగా లేకపోతే ఇంట్లో ఉండేవాళ్లు వ్యసనాలకు లోనయ్యే అవకాశం ఉంటుందా?**

**జవాబు:** ఉంటుంది. ఒక ఇంటికి వ్యసనాలు కలిగించే దోషం ఏదైనా ఉంటే ఆ ఇంట్లో ఉండేవాళ్లు వ్యసనాలకు లోనయ్యే అవకాశం వంద శాతం ఉంటుంది. ఏ ఇంటికైనా వ్యసనాల సమస్యకి ప్రధానమైన కారణం వాయువ్య దోషాలే! ఈ దిక్కు బాగుంటే మంచి ఫలితాలను ఇస్తుంది. బాగా లేకపోతే చెడు ఫలితాలను ఇస్తూ ఉంటుంది. వాయువ్యం దోషపూరితం అయినప్పుడు ఆ ఇంట్లో ఉండే వాళ్లకి వ్యసనాలు, మానసిక సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. వాయువ్యానికి సంబంధించిన దిక్పాలకుడు వాయుదేవుడు. వాయువు స్వతంత్రమైనది, చంచలమైనది. మనసు కూడా చంచలమైనది.

ఆ విధంగా వాయువ్యానికి మనసుకి సంబంధాన్ని కలపటం వాస్తు శాస్త్రంలో ప్రస్తావించబడింది. ఉత్తర భాగంలో కొంత భాగం, పశ్చిమ భాగంలో కొంత భాగం కలిపితే వాయువ్యం దిక్కువ అవుతుంది. ఉత్తర, పశ్చిమ రెండు దిక్కులు కలిసే మూలని 'వాయువ్య మూల' అంటాం. వాయువ్యంలో సాధారణంగా ఉత్తర వాయువ్యం పశ్చిమ వాయువ్యం అని రెండు భాగాలు ఉంటాయి. మంచి ఫలితాలను ఇచ్చేది పశ్చిమ వాయువ్యం. చెడు ఫలితాలను ఇచ్చేది ఉత్తర వాయువ్యం. దానికితోడు, అక్కడ దోషాలు కూడా అంటే ఉత్తర వ్యాయువ్యానికి సంబంధించిన దోషాలు వుంటే ఆ దోషం వలన ఈ వ్యసనాలు కానీ, మానసిక రుగ్మతలు కానీ గాలి సోకేటటువంటి ప్రతికూల ఫలితాలకు అవకాశాలు ఉంటాయి.

సాధారణంగా ఉత్తరం అంటే మనం కుబేర స్థానమని, బృహస్పతి స్థానం అని చెప్పుకుంటాం. కుబేరుడు ధనానికి ప్రతీక. బృహస్పతి అంటే జ్ఞానం. ధనం, జ్ఞానం ఈ రెండింటి కలయిక ఇది. ఇది ఏ విధంగా ఇంటిని ప్రభావితం చేస్తుందో అదే విధంగా ఆ ఇంట్లో వున్నవాళ్లు ప్రభావితం గావింపబడతారు. ఉత్తర వాయువ్యంలో దోషాలను కలిగించే పరిస్థితులు ఏమిటంటే- ఉత్తర వాయువ్యం పెరిగి వుండటం. ఉత్తర వాయువ్యం పెరిగిందంటే, ఉత్తర ఈశాన్యం తగ్గింది అని అర్థం. దానివల్ల ధనానికి సంబంధించిన జ్ఞానానికి సంబంధించిన సమస్యలు ఉంటాయి. అలా పెరగలేదు, మామూలుగానే ఉందనుకోండి. దోషం లేదు కనుక ఇల్లు మామూలుగానే ఉంటుంది. ఇంట్లో ఉన్నవాళ్లు మామూలుగానే ఉంటారు. ఉత్తర వాయువ్యం నుంచి ఏదైనా వీధిపోటు తగులుతుంటే, దాని వలన ఉత్తర వాయువ్యం ప్రతికూలంగా ప్రభావితం చూపెడుతుంది. ఉత్తర వాయువ్య వీధిపోటు వలన కూడా ఉత్తర వాయువ్య దోషం ఏర్పడి ఆ ఇంట్లో నివసించేవాళ్లకి అనేక సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. 'గాలి సోకటం' లాంటి సమస్య ఇందులో ఒకటి. సెలెక్ట్ వాయువ్య వీధిపోటు వలన 'నెగిటివ్ రిజల్ట్స్' మొదలవుతాయి. అందువల్ల ఉత్తర వాయువ్య దోషాలు ఉంటే వెంటనే సవరించుకోవాలి.

ఒక ఉత్తర వాయువ్యం పెరిగిన స్థలంలో నలు చదరపు ఇల్లు కట్టుకున్నా సరే.. ఆ స్థలానికి ఉత్తర వాయువ్యం పెరగటం వలన దోషం ఏర్పడుతుంది. పెరిగిన ఉత్తర వాయువ్యాన్ని సవరించుకోవడం వలన దోషం పోతుంది. ప్రతికూల ఫలితాలు తగ్గి అనుకూల ఫలితాలు మెరుగవుతాయి.

అలాగే నేరుగా ఒక 'వీధిపోటు' ఉత్తర వాయువ్యానికి కాంపౌండ్ గోడకు తగిలితే దానిని 'ఉత్తర వాయువ్య వీధిపోటు' అంటారు. కాంపౌండ్ గోడల లోపల ఉన్న ఇంటికి ఇది తగలవచ్చు, తగలపోవచ్చు. ఇటువంటి ఉత్తర వాయువ్య వీధిపోటు ఆ ఇంట్లో ఉండే వాళ్లందరి మీద ప్రతికూలంగా పని చేయటం మొదలు పెడుతుంది. కనుక ఆ వీధిపోట్లు లేకుండా చూసుకోవాలి. ఉత్తర వాయువ్య భాగం పెరగకుండా చూసుకోవాలి. ఒకవేళ పెరిగి వుంటే సరిచేసుకోవాలి. ఉత్తర వాయువ్య వీధిపోటు వుంటే, దానిని తప్పించే విధంగా అంటే ఆ వీధిపోటును తప్పించి మనం ఇంటి స్థలాన్నిగానీ, ఇంటినిగానీ సరి చేసుకునే అవకాశం ఉంటే చేసుకోవాలి. వీధిపోట్లు ఉన్నాయని కంగారు పడవద్దు. వీధిపోటును సరి చేసుకోలేకపోతే, నియంత్రించుకోవటానికి కొన్ని 'ప్రత్యామ్నాయ పద్ధతులు' ఉన్నాయి. వాటిని ఆచరించటం వల్ల చెడు ఫలితాలు క్రమంగా తగ్గిపోయి మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుంది. ✦

వాస్తువిద్వాన్ **డా॥ దంతూరి పండరినాథ్** పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: **సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3**

## వాస్తువార్త

పూర్తి పేరు.............................................

పుట్టినతేదీ : ...................... ఊరు : .................

జన్మ నక్షత్రం: ...............తల్లి పేరు: ...................

చిరునామా: ..............................................



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



కార్యాలయంలో సహోద్యోగులతో సఖ్యత పెంచుకుంటారు. మీకు కావాల్సిన ప్రయోజనాలను దక్కించుకుంటారు. సమయస్ఫూర్తితో వ్యవహరిస్తారు. ఎరుపు వస్తులు, అష్టమూలికా తైలంతో నిత్య దీపారాధన చేయడం మంచిది. స్త్రీ సంతానం పట్ల అధిక శ్రద్ధ కనబరుస్తారు. కొన్ని రకాలైననటువంటి అపోహలు, అభద్రతా భావాన్ని కలిగి వుంటారు.



## వృషభం

విదేశీ ప్రయత్నాలు అనుకూలంగా ఉంటాయి. విదేశాలలో వ్యాపారాలు ప్రారంభించడం కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. దీర్ఘాలోచన, నిద్ర మానుకొని చేసే ఆలోచనలతో ఏమాత్రం ప్రయోజనాలు ఉండవని ఆలస్యంగా గ్రహిస్తారు. నవగ్రహాల దగ్గర నవగ్రహ వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు.

## మిథునం



స్వల్ప అనారోగ్య సమస్యలు వస్తాయి. నూతన ప్రయాణాలు, విహార యాత్రలు కలిసి వస్తాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించండి. సంతాన పురోగతి రీత్యా కీలకమైన నిర్ణయాలు అమలు పరుస్తారు. వారి అభిప్రాయాలను పట్టించుకోరు. ఏ నిర్ణయమైనా ఒకటికి రెండుసార్లు ఆలోచించి, కుటుంబ సభ్యులతో చర్చించి ఆ తరువాత నిర్ణయం తీసుకుంటారు.



## కర్కాటం

అనుకున్న కార్యక్రమాలతో పురోగతి సాధిస్తారు. నూతన వ్యాపారాలు ప్రారంభించాలన్న ఆలోచనలు ఫలిస్తాయి. పిల్లల పట్ల శ్రద్ధ కనబరుస్తారు. వాళ్ల భవిష్యత్తు గురించి దీర్ఘాలోచనలు చేస్తారు. జీవిత భాగస్వామి సలహాలు, సూచనల మేరకు నిర్ణయాలు తీసుకుంటారు. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయడం మంచిది.

## సింహం



స్థలాల అమ్మకాలు-కొనుగోలు వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. లాభాలను అందుకుంటారు. ప్రయత్న పూర్వకంగా కొన్ని నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. నూతన విద్యల పట్ల ఆసక్తి కనబరుస్తారు. పోటీ పరీక్షల్లో పాల్గొంటారు. గవర్నమెంట్ ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు సఫలీకృతం అవుతాయి. చేతికి కుబేర కంకణం ధరించండి.



## కన్య

ప్రేమ వ్యవహారాలు మీకు అంతగా నచ్చకపోవచ్చు. ఇంట్లో శుభ కార్యాలకు సంబంధించిన ప్రస్తావన వస్తుంది. శంకుస్థాపన, గృహ ప్రవేశం, ఇతర శుభ కార్యాలకు సంబంధించిన ముహూర్తాలు ఖరారు చేసుకుంటారు. సర్పదోష నివారణ కంకణం చేతికి ధరించడం శుభప్రదం. కార్యానుకూలత కోసం చేసే కొన్ని కార్యక్రమాలలో విజయం సాధిస్తారు.

## తుల



కొత్త అవకాశాలు చేతికి అందుతాయి. నూతన ఉద్యోగ ప్రయత్నాలు కలిసి వస్తాయి. విదేశీ ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. వ్యాపారం అభివృద్ధి దిశలో నడుస్తుంది. కుటుంబ పరిరక్షణ కోసం నూతన బాధ్యతలు చేపడతారు. పెంపుడు జంతువుల పట్ల ఆసక్తి కనబరుస్తారు. భాగస్వామ్య వ్యాపారం బాగుంటుంది. ఇంట్లో, వ్యాపార ప్రదేశంలో సాంబ్రాణి, దైవికం పొడితో ధూపం వేయండి. స్నేహితుల సహాయం అందుకుంటారు.



## వృశ్చికం

బ్యూటీపార్లర్ నిర్వాహకులకు అనుకూలంగా ఉంటుంది. లాభాలను అందుకుంటారు. ప్రయాణాలలో స్వల్ప ఆటంకాలు ఏర్పడతాయి. అనుకున్న సమయానికి పనులు పూర్తి కాక చికాకుకు గురయ్యే అవకాశం ఉంది. సహచర బృందంతో సన్నిహితంగా మెలగుతారు. సౌర కంకణం ధరించండి. ఆరోగ్యం మెరుగు పడుతుంది. వినోద భరితమైన కార్యక్రమాల్లో పాల్గొనాలన్న ఆలోచనలు ఫలిస్తాయి.

## ధనుస్సు



శుభ కార్యాల వ్యవహారాలకు సంబంధించిన ఆలోచనలు ముడిపడతాయి. ముహూర్తాలను కుదుర్చుకుంటారు. ఇరుగు-పొరుగు వారితో సఖ్యతగా మెలగాలన్న ఆలోచనలు అంతంత మాత్రంగానే ఉంటాయి. కొంతమంది ప్రవర్తన మీకు ఏమాత్రం నచ్చదు. వాళ్ల వల్ల ఇబ్బందుల పాలవటం సహించరాని అంశంగా పరిణమిస్తుంది. ఆధ్యాత్మిక చింతన అలవడుతుంది. ప్రతిరోజూ దేవీ, దేవతలకు ప్రథమ తాంబూలం సమర్పించండి.



## మకరం

మీ కోసం, మీ కుటుంబం కోసం కొన్ని కార్యక్రమాలు చేపట్టి, విజయం సాధిస్తారు. జీవిత భాగస్వామి సలహాలు, సూచనలు పాటిస్తారు. వ్యాపారాన్ని విస్తరింపచేయాలన్న ఆలోచనలు కలుగుతాయి. సంగీతం, సాంస్కృతిక రంగాల పట్ల ఆకర్షణ కలిగి ఉంటారు. అందరితో కలివిడిగా ఉండగలుగుతారు. జిల్లేడు వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయడం శుభప్రదం.

## కుంభం




జీవిత భాగస్వామి సలహాలు, సూచనల మేరకు నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ప్రయోజనాలను ఆశించి స్నేహితుల ద్వారా రాయబారాలు నడుపుతారు. సేవక బృందంతో సతమతమవుతారు. సాంకేతిక లోపాల వలన మీకు రావాల్సిన ఉత్తరాలు, శుభవార్తలు ఆలస్యంగా చేతికి అందుతాయి. చేసిన పని పూర్తిగాక మళ్లీ ప్రయత్నిస్తారు.




## మీనం

దూర ప్రాంతాల్లోనివారు మీకు ఎంత సహకరించినా కొన్ని పనులు మాత్రం పూర్తి కావు. కోరుకున్న మనిషిని పెళ్లి చేసుకోవడానికి ఎన్నో అడ్డంకులు ఏర్పడతాయి. కార్యాల యంలో అప్రయత్నంగా కొన్ని కార్యక్రమాలు ముడిపడతాయి. ప్రయోజనాలు అందుకుంటారు. నూతన గృహానికి సంబంధించిన ఆలోచనలు, పనులు కలిసి వస్తాయి. సిద్ధగంధంతో శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అర్చన జరిపించండి.

ఈ వారం కా‘ర్టూన్స్’


పేషంట్ ను చూడ్డానికా? ఎప్పుడైనా ఎంత మంది అయినా రావచ్చు..కానీ ఒక్కొక్కరికి 100/- ఎంట్రీ ఫీ!!
హాస్పిటల్.
REGISTRATIONS
DOCTORS.


మనం ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా నెల నెలా జీతాలిస్తే.. ఎంచక్కా వాళ్లు కూడా నెల నెలా బిల్లులు కట్టేస్తారు!!
ప్రభుత్వం
ఇకపై నెల నెలా కరెంటు, ఆస్తిపన్ను, మంచి నీటి బిల్లులు
-ప్రభుత్వం


..నీ దగ్గర అసిస్టెంట్ గా పని చేస్తానే అనే కదా అన్నాను!?


# ఫోటో ఫీచర్











ఇటలీలోని
ఈ రహదారి ప్రేమదారిగా పేరు గాంచింది.
సుమారు మూడు వేల అడుగులు ఉండే
ఈ దారి సముద్రం వెంట, కొండల
పక్కన సాగుతూ ఐదు ఊళ్ల వరకు
ఉంటుంది. ఈ ఐదు గ్రామాలను
సినిక్ తెర్రే అని అంటారు.
టూరిస్టులను
నియంత్రించడానికి టికెట్
పెట్టినప్పటికీ పర్యాటకుల క్యూ
ఏమాత్రం తగ్గడం లేదు
సుమా!



